

జీవితాన్ని ఆస్వాదించండి ఒంటరిగా ఉన్నప్పుడు జనస మూహంలో ఉండటం అజ్ఞానం. జనసమూహంలో ఒంటరిగా ఉం డటమే జ్ఞానోదయం, జనసమూ హంలో ఏకత్వ భావన -- ఇది వివేకానికి చిహ్నం.కొందరికి జన సమూహంలో ఉన్నప్పుడు మా త్రమే ఆనందించడం తెలుసు; మరికొందరు నిశ్శబ్దంలో ఒంటరి గా ఉన్నప్పుడు మాత్రమే ఆనం దించగలరు. నేను మీకు రెండూ చేయమని చెబుతున్నాను. జీవిత జ్ఞానం ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది, మరియు మరణ జ్ఞా నం మిమ్మల్ని నిర్భయంగా, స్థిరం గా చేస్తుంది.ఒంటరిగా ఉన్న ప్పు డు ఆనందించండి మరియు జ నాలతో ఉన్నప్పుడు ఆనందిం చండి.నిశ్శబ్దాన్ని ఆనందించండి మరియు శబ్దాన్ని ఆనందించం డి.జీవితాన్ని ఆనందించండి మ రియు మరణాన్ని ఆనందించం డి!

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

ప్రజా దీవెన

www.prajadeevena.com

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 356 | బుధవారం | 28 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

ఆర్నబ్ అల్లకల్లోలం

ఉగ్రరూపం దాల్చిన ఉప్పాడ





అతితీవ్ర తుఫాన్ 'ఆర్నబ్' మంగళవారం కోస్తా జిల్లాలను వణికించింది. పెనుగాలులు, కుంభవృష్టితో అనేకచోట్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు అనేక ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. కుంభవృష్టి కురిసింది. విశాఖ జిల్లాలో అత్యధికంగా 20.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనిని కేటగిరీ-3 తుఫాన్‌గా నిపుణులు విశ్లేషించారు. అతి తీవ్ర తుఫాన్ తీరాన్ని తాకే ప్రక్రియ మంగళవారం రాత్రి రాజోలు, నరసాపురం ప్రాంతాల్లో ప్రారంభమైంది. బుధవారం తెల్లవారుజాము వరకు తీరం దాటే ప్రక్రియ కొనసాగనుందని ఐఎండీ తెలిపింది.

పెనుగాలులు.. రాకాసి అలల బీభత్సం

విశాఖలో 20.2 సెం.మీ. రికార్డు వర్షం

నేడూ 11 జిల్లాల్లో కుంభవృష్టి

మరో 4 జిల్లాల్లో అతిభారీ వర్షాలు

కాకినాడ, కోనసీమకు రెడ్ అలర్ట్

కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాలకు భారీ వర్ష సూచన

భారీగా రైళ్లు, విమానాలు రద్దు

ప్రయాణాలు వాయిదా వేసుకోండి


ఇళ్లలోనే సురక్షితంగా ఉండండి

లోతట్టు, తీర, లంక ప్రాంతాల ప్రజలు షెల్టర్లకు తరలి వెళ్లండి

04

తెలంగాణలో కూడా తెగవర్షా లు!

కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీగా కురిసే అవకాశం.. తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



కట్టలు తెంచుకున్న కరువు

111 మండలాల్లో తీవ్రంగా.. 254 చోట్ల మధ్యస్థంగా

నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో అత్యధికంగా 28 చోట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన.. జీవో జారీ

ప్రత్యేక కరువు ప్యాకేజీ కింద రూ.20 వేల కోట్లు అవసరం

సెంట్రల్ పూల్ నుంచి 1500 మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలి

ఉపాధి హామీ పథకంలో మొత్తం కూలి కేంద్రమే భరించాలి

రాష్ట్రానికి అదనపు పనిదినాలు కేటాయించాలని విజ్ఞప్తి

ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3 నుంచి 3.5 శాతానికి పెంచాలి

రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి లేఖ

అంచనా వేసిన దానికంటే పెరిగిన కరువు మండలాలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం, భూగర్భ జలాలు పడిపోవడంతో రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ శాఖల నుంచి నివేదికలు, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా రాష్ట్రంలో 365 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 31 జిల్లాల పరిధిలో 111 మండలాల్లో

మిగతా 2 లో

కళ్ళకు కట్టినట్లు కాకతీయతోరణం

డిజైన్లు ధూంధాంగా ఉండాలి

రేపు ఢిల్లీలో కర్టెన్ రైజర్‌ను విజయవంతం చేయాలి

నవంబరు మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు కావాలి

టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ విజయాలపై ప్రచారం చేయాలి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

550కి పైగా దిగ్గజ సంస్థలకు ఆహ్వానం: సీఎస్ సంజయ్ జాజు



'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'తో తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో మరింత పెరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో ఏర్పాటు చేసే డిజైన్లు ధూంధాంగా ఉండాలని చెప్పారు. డిజైన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

2

ఎల్‌నినోపై అఖిలపక్షం

క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి అధ్యక్షతన భేటీ

అవకాశవాదులు అవసరం లేదు

పోరాటయోధులే మా బలం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నయని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, రేవంత్ తన వైఫల్యాలతో ప్రజల నెత్తిన రుద్దిన కరువని నిప్పులు చెరిగారు.

విపక్షాలు 2 లో

కాంగ్రెస్ పాలనలో కరువు కోరల్లో తెలంగాణ..

రేవంత్ రెగ్యులర్ కాదు.. రెన్యువల్ సీఎం

కేసీఆర్ తిరిగి వస్తేనే రాష్ట్రం మళ్లీ గట్టెకుతది..

11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ

పదేండ్ల పాటు మంత్రి పదవిని అనుభవించి అధికారం పోగానే పార్టీ వీడిన ఇంద్రకరణ్‌రెడ్డి

అవకాశవాదులు పోయినా, పోరాటవాదులే బలం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నా జీవితకథ నాతోనే వెల్లడి

నా పుస్తకం విడుదలయ్యాక రచ్చ తప్పదేమో!

నా జీవిత కథను నేనే చెప్పాల్సిన సమయం వచ్చింది

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ వ్యాఖ్యలు

04

జవహర్ నగర్‌పై జవాబేది



కాలుష్యం పేదల ప్రాణాలను హరిస్తున్నా పట్టదా?..

విష రసాయనాలతో అనేక రకాల వ్యాధులు

పర్యావరణం పూర్తిగా నాశనం


నాడు ఉద్యమం చేసి నేడు మౌనమా?

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం

03

కట్టలుతెంచుకున్న కరువు

మొదటి పేజీ తరువాయి



తీవ్రమైన కరువు, 254 మండలాల్లో మధ్యస్థ కరువు మండలాలు ఉన్నట్లు గుర్తించింది. ఇందులో అత్యధికంగా నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో 28 చొప్పున మండలాలు ఉండగా, సూర్యాపేటలో 23, ఆదిలాబాద్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 20 చొప్పున, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 18 చొప్పున మండలాలు ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లోనూ కొన్నిచోట్ల తీవ్రంగా, కొన్ని ప్రాంతాల్లో మధ్యస్థంగా కరువు ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవో ఎం.ఎస్. నంబరు 3ను జారీ చేసింది. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఈ జీవోలో పొందుపరిచింది. కరువు మండలాలను ప్రకటించిన నేపథ్యంలో కరువు ప్రత్యేక ప్యాకేజీ కింద రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. అలాగే సెంట్రల్ పూల్ కింద 1500 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయాలని, ఎఫ్ఆర్బీఎం పరిమితిని 3శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని (2026-27 ఆర్థిక సంవత్సరం జీఎస్డీపీకి) కేంద్రాన్ని కోరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతోపాటు ఉపాధి హామీ పథకంలో కూలి మొత్తాన్ని కేంద్రమే భరించేలా అదనపు పనిదినాలను కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేయనుంది. కరువు ప్రభావిత ప్రాంతాలు, ఎల్నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఆ సమావేశం తరువాత రెండు రోజుల్లో కేంద్రానికి లేఖ రాయనుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన ప్రతినిధుల బృందం రాష్ట్రానికి వచ్చి పర్యటించనుంది. పర్యటన అనంతరం ఆ బృందం కేంద్రానికి ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్రానికి సాయం అందుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన కరువు మండలాల్లో ఎక్కడైనా పట్టణ ప్రాంతాలు ఉంటే.. వాటిని కరువు ప్రభావితంగా పరిగణించరు. కానీ, తాగునీటి విషయంలో మాత్రం కరువుతో సమానంగానే పరిగణిస్తారని జీవోలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత వేసిన అంచనాల్లో 235 మండలాల్లోనే కరువు ఉంటుందని భావించగా, ఇప్పుడు అది 365 మండలాలకు చేరుకుంది.

కరువు సాయం ఇలా.. కలెక్టర్లకు బాధ్యతలు

రాష్ట్రంలో గుర్తించిన కరువు మండలాల్లోని రైతులకు వ్యవసాయం సహా ఇతరత్రా పలు విధానాల్లో సాయం అందించాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని (సబ్సిడీ రూపంలో) నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే రైతులకు బ్యాంకు రుణ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించింది. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణాల వసూళ్ల విషయంలో రైతులపై బలవంతపు చర్యలు లేకుండా చూడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖకు నిర్దేశించింది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం, అదనంగా 50 పనిదినాలను వీబీ-జీ-రామ్ కింద కేటాయించాలని, అవసరమైన చోట తాగునీటి సరఫరాను మెరుగుపరడం, పశుగ్రాసం అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొంది. గుర్తించిన కరువు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ కరువు ప్రభావిత మండలాల ప్రకటన ఆరు నెలలపాటు లేదా అంతకుముందే ఉపసంహరించే వరకు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో లేని మండలాల్లోనూ పరిస్థితులు మరింత దిగజారితే, మరో నోటిఫికేషన్ ద్వారా వాటిని కూడా కరువు ప్రభావిత ప్రాంతాల జాబితాలోకి చేర్చే అవకాశం ఉందని తెలిపారు.

తగ్గిన సాగు విస్తీర్ణం.. నిండని జలాశయాలు..

ఈ ఏడాది జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో 615.5 మి.మీటర్ల వర్షపాతమే నమోదైందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. 17 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. వానాకాలం సీజన్ సాగు విస్తీర్ణం గతంలో 139.28 లక్షల్లో ఉండగా, ఈసారి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. ఇందులో వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షలకు తగ్గింది. ఇక రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటి నిల్వలు.. మొత్తం సామర్థ్యంతో పోల్చితే ప్రస్తుతం తక్కువగా ఉన్నాయి. జలాశయాల్లో మొత్తం 585 టీఎంసీలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 179.63 టీఎంసీల నిల్వలే ఉన్నాయని జీవోలో తెలిపారు.

జిల్లాల వారీగా ప్రభుత్వం ప్రకటించిన మండలాల సంఖ్య

ఆదిలాబాద్ 20, భద్రాద్రి కొత్తగూడెం 16, హనుమకొండ 14, జగిత్యాల 03, జనగామ 04, భూపాలపల్లి 05, జోగులాంబ గద్వాల 13, కామారెడ్డి 04, కరీంనగర్ 03, ఖమ్మం 17, ఆసిఫాబాద్ 05, మహబూబాబాద్ 07, మహబూబ్‌నగర్ 13, మంచిర్యాల 11, మెదక్ 02, మేడ్చల్--మల్కాజిగిరి 09, ములుగు 04, నాగర్‌కర్నూల్ 13, నల్గొండ 28, నారాయణపేట 13, నిర్మల్ 09, నిజామాబాద్ 18, రాజన్న సిరిసిల్ల 02, రంగారెడ్డి 18, సంగారెడ్డి 28, సిద్దిపేట 08, సూర్యాపేట 23, వికారాబాద్ 20, వనపర్తి 11, వరంగల్ 08, యాదాద్రి భువనగిరి 17 మొత్తం365.

ఈ20పై డబ్బిచ్చి దుష్ప్రచారం చేయించారు: గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 27: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడంపై రేగిన విమర్శలు డబ్బిచ్చి చేయించినవి అని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఈ-100తో నడిచే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు అనుమతిస్తూ కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లో మార్పులు చేసిన ఒక రోజు తర్వాత గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఢిల్లీలో సీఐఐ నిర్వహించిన సదస్సులో గడ్కరీ మాట్లాడుతూ.. "ఈ-20కి వ్యతిరేకంగా మూడు నెలల క్రితం పెద్దఎత్తున గళాలు విప్పారు. ఇప్పుడు అవి ఆగిపోయాయి. అదంతా డబ్బిచ్చి చేసిన దుష్ప్రచారం" అన్నారు. గత మూడేళ్ల నుంచి కోట్ల కొద్దీ వాహనాలు ఈ-19, ఈ-20 పెట్రోల్ వినియోగిస్తున్నా, ఎలాంటి దుష్ప్రభావాలు కనపడలేదన్నారు.

ఇథనాల్ శాతాన్ని 20 కంటే పెంచం: హర్దీప్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్‌ను 20 శాతం కంటే పెంచే ఆలోచన ప్రస్తుతం లేదని కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు. దక్షిణ గోవాలో 29వ ఎనర్జీ టెక్నాలజీ, ఇన్నోవేషన్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బయో ఇంధనాలపై తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ-20పై జరిగిన దుష్ప్రచారం ఓ కల్పిత కథ అని పేర్కొన్నారు. ఒకవేళ ఇంజన్లలో సమస్యలు వస్తే రోజుకు 6 కోట్ల వాహనాలు షెడ్లకు వెళ్లేవని అన్నారు. 2003కు ముందు తయారైన వాహనాల విషయంలోనే ఈ-20 పెట్రోల్ సమస్య వచ్చిందన్నారు. ఈ-20 పెట్రోల్ ప్రారంభించిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి రూ.1.60 లక్షల కోట్లు మిగిలిందని, దానిలో 1.40 లక్షల కోట్లు రైతులకు ఇచ్చేశామని వెల్లడించారు. రైతులు అన్నదాతల నుంచి ఇంధన దాతలుగా మారారని అన్నారు

మెలానియా జోక్యం.. యుద్ధంలో కాస్త విరామం

మైకోలైవ్ (ఉక్రెయిన్), అక్టోబరు 27: అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ జోక్యం కారణంగా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో మంగళవారం ఓ చోట ప్రాంతీయ కాల్పుల విరమణ అమలయింది. ప్రస్తుతం రష్యా ఆక్రమణలో ఉన్న ఉక్రెయిన్ నగరం ఒలెష్కీలో మానవతా సహాయం అందించేందుకు ఆమె ఆధ్వర్యంలో సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ నగరంలో 2వేల మంది వృద్ధులు ఉండగా, యుద్ధం వల్ల వారికి ఎలాంటి ఆహారం, మంచినీరు, మందులు అందడం లేదు. ఈ అంశం ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావనకు రావడంతో మెలానియా స్పందించారు. మానవతా దృక్పథంతో సహాయం అందించాలని నిర్ణయించారు. ఆమె కార్యాలయం సిబ్బంది ఉభయ దేశాలతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేశారు. అక్కడ ఉన్న ప్రజలను ఈ నెల 29 నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కూడా సన్నాహాలు చేశారు. దాంతో అంతవరకు కాల్పులు విరమణ కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

దాడులు ఆపితే బిలియన్ డాలర్లు ఇస్తాం

హూతీలకు సౌదీ అరేబియా ఆఫర్!

జెరూసలేం, రియాద్, అక్టోబరు 27: తమపై దాడులు ఆపితే ఒక బిలియన్ డాలర్లు(రూ.10వేల కోట్లు) ఇస్తామంటూ సౌదీ అరేబియా..హూతీలకు ప్రతిపాదన పంపించింది. తమ చమురు క్షేత్రాలపై యెమన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు దాడులు చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన చేసింది. ఇరాన్‌లో ఆకస్మికంగా పర్యటించిన సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ ఈ ప్రతిపాదన చేశారు. ఇందుకు ఇరాన్ మధ్యవర్తిత్వం వహించేలా ఏర్పాట్లు జరిగాయని ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి. హెర్కులస్ మిలటరీ రవాణా విమానంలో సొమ్ము కూడా తీసుకెళ్లారని పేర్కొన్నాయి. అయితే సొమ్ము ఇచ్చిందీ లేనిదీ నిర్ధారణ కాలేదు. మరోవైపు, సౌద అరేబియాకు రక్షణ సాయం అందించేందుకు టర్కీ ముందుకు వచ్చింది. దీనిపై హూతీలు తీవ్రంగా స్పందించారు. ఈ నిర్ణయం ద్వారా ఈజిప్టు తమ దేశంపై పరోక్షంగా యుద్ధం ప్రకటించినట్లయిందని హూతీల సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, సౌదీ రాజధాని రియాద్‌లోని రక్షణ శాఖ కార్యాలయంపై బాలిస్టిక్ క్షిపణితో దాడి చేసినట్లు హూతీ తిరుగుబాటుదారులు మంగళవారం ప్రకటించారు. కానీ, ఆ క్షిపణులను గగనతలంలోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు.

17 మంది ఖైదీల పరారీ

ఓ ఖైదీకి మూర్ఛవచ్చిందంటూ నాటకమాడి, గార్డులపై దాడి చేసి జైలు నుంచి జంప్

తమిళనాడులోని తేని జిల్లా జైలులో ఘటన

13 మందిని మళ్లీ అరెస్టు చేసిన పోలీసులు

చెన్నై, అక్టోబరు 27: తమిళనాడులోని తేని జిల్లా జైలులో అనూహ్య సంఘటన జరిగింది. విచారణ ఖైదీలుగా ఉన్న 17మంది గార్డులపై దాడి చేసి, వారి వద్ద ఉన్న తాళాలతో గేట్లు తెరుచుకుని జైలు నుంచి పారిపోయారు. సినీ పక్కీలో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో యావత్ తమిళనాడు పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. జైలు చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పట్టి కొన్ని గంటల వ్యవధిలోనే పరారైన వారిలో 13 మందిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా గాలిస్తోంది. ఇక, ఈ ఘటనకు సంబంధించి తేని జైలు సూపరింటెండెంట్ సహా 9మంది సిబ్బందిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తేని సమీపంలోని తేకంపట్టిలో ఉన్న జిల్లా జైలులో 200 మంది ఖైదీలను ఉంచేందుకు అవకాశముంది. అయితే నాలుగు బ్లాకులున్న ఆ జైలులో 334 మంది ఖైదీలను ఉంచారు. 2వ నెంబర్ బ్లాక్ బేరక్‌లో గంజాయి, చోరీ కేసులు, మారణాయుధాలతో దాడి, బెదిరింపులు వంటి నేరాలపై అరెస్టయిన విచారణ ఖైదీలు 17 మందిని ఉంచారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో జైలులోని ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందంటూ ఖైదీలంతా బిగ్గరగా కేకలు పెట్టారు. దీంతో జైలు గార్డు, ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లారు. వెంటనే అక్కడున్న ఖైదీలంతా ఆ పోలీసులపై దాడి చేశారు. తాళం చెవులను లాక్కొని, వాటి సాయంతో 17మంది ఖైదీలు పరారయ్యారు. సమాచారం అందుకున్న జైళ్ల విభాగం ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ ప్రవీణ్ గౌతం తదితరులు హుటాహుటిన అక్కడకు చేరుకుని గాయపడ్డ సిబ్బందిని తేని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరారైన ఖైదీలను పట్టుకునేందుకు 17ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. అలాగే, ఎస్పీ కార్యాలయం నుంచి డ్రోన్లను తెప్పించి అన్వేషణ మొదలుపెట్టారు. ఆ జైలు పరిసరాల్లోని పొలాలు, కొండలు, సమీప బస్టాండ్లలో తీవ్రంగా గాలించారు. 13మందిని తిరిగి అదుపులోకి తీసుకున్నారు.

కళ్ళకు కట్టినట్లు కాకతీయతోరణం

కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ డిజైన్లకు ప్రాధాన్యమివ్వండి

రేపు ఢిల్లీలో కర్టెన్ రైజర్‌ను విజయవంతం చేయాలి

నవంబరు మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు కావాలి

టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ విజయాలపై ప్రచారం చేయాలి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

550కి పైగా బిగ్గజ సంస్థలకు ఆహ్వానం: సీఎస్ సంజయ్ జాజు



ప్రజా దీవెన, హైదరాబాద్ : 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'తో తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో మరింత పెరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో ఏర్పాటు చేసే డిజైన్లు ధూంధాంగా ఉండాలని చెప్పారు. డిజైన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న డిజైన్ల గురించి సీఎంకు అధికారులు వివరించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7 నుంచి నిర్వహించే సమ్మిట్ కార్యక్రమం, ఔత్సాహిక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. నవంబరు మొదటి వారంలోగా ప్రణాళికలను ఖరారు చేసుకుని పలు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సీఈవోలు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో గొప్ప విజయాలను సాధించిన ప్రముఖుల గురించి అతిథులకు చాటిచెప్పే విధంగా హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రచార ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలన్నారు. క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రపంచ స్థాయి ప్రముఖులను గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించాలన్నారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్(ఏవీజీసీ) రంగాలకి సంబంధించి ప్రత్యేకంగా చేస్తున్న ఏర్పాట్ల గురించి అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్‌జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ అనుదీప్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా 'ఇన్వెస్ట్ తెలంగాణ-2026' ప్రపంచ సదస్సుకు 550కి పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసం వివిధ కమిటీలు చేపడుతోన్న ఏర్పాట్లను మంగళవారం ఆయన సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. సదస్సులో ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి, ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, ఒప్పందాల భేటీలు, ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నామని తెలిపారు.

వాతావరణ మార్పులపై ప్రత్యేక సెమినార్

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే 'ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్-2026'లో వాతావరణ మార్పులపైనా(క్లైమేట్ చేంజ్) ప్రత్యేకంగా సెమినార్ నిర్వహించనున్నారు. సదస్సులో ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనేది ప్రధాన థీమ్‌గా ఉండగా, దానికి సబ్ థీమ్‌గా ఈ క్లైమేట్ చేంజ్‌ను చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వాతావరణ నిపుణులతో పాటు వివిధ యూనివర్శిటీలు, సంబంధిత రంగాల్లో పనిచేసే నిపుణులను ఈ సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు. సెమినార్‌లో ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు వివిధ దేశాలు చేపడుతున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలపై ప్రత్యేక చర్చలు జరపనున్నారు.

ఎల్‌నినోపై అఖిలపక్షం

క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి అధ్యక్షతన భేటీ

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. డిప్యూటీ సీఎం, ఎల్‌నినోపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్తు సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అభిప్రాయాలను తీసుకోనున్నారు. ఈ సమావేశంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి పాల్గొననున్నారు. ఈమేరకు మంత్రులకు సమాచారం అందించాల్సిందిగా వారి ఓఎస్డీలకు రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ లేఖలు పంపించారు.

ఆర్నబ్ అల్లకల్లోలం

విరుచుకుపడిన అతి తీవ్ర తుఫాను

ప్రజా దీవెన, హైదరాబాద్ : అతితీవ్ర తుఫాన్ 'ఆర్నబ్' మంగళవారం కోస్తా జిల్లాలను వణికించింది. పెనుగాలులు, కుంభవృష్టితో అనేకచోట్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు అనేక ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. కుంభవృష్టి కురిసింది. విశాఖ జిల్లాలో అత్యధికంగా 20.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనిని కేటగిరీ-3 తుఫాన్‌గా నిపుణులు విశ్లేషించారు. అతి తీవ్ర తుఫాన్ తీరాన్ని తాకే ప్రక్రియ మంగళవారం రాత్రి రాజోలు, నరసాపురం ప్రాంతాల్లో ప్రారంభమైంది. బుధవారం తెల్లవారుజాము వరకు తీరం దాటే ప్రక్రియ కొనసాగనుందని ఐఎండీ తెలిపింది. గాలులు గంటకు 125 నుంచి 135, అప్పుడప్పుడు 150 కి.మీ. వేగంతో వీస్తాయని పేర్కొంది. కాకినాడ, యానాం పరిసరాల్లో సముద్ర అలలు 1.5 నుంచి 2.5 మీటర్ల ఎత్తున ఎగసిపడతాయని తెలిపింది. తీరం దాటిన తర్వాత ఉత్తరంగా దిశ మార్చుకుని ఉమ్మడి గోదావరి, విశాఖ జిల్లాల మీదుగా దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా వైపు పయనించనున్నది. తుఫాన్ దిశ మార్చుకునే సమయంలో బాగా నెమ్మదించనుండడంతో గాలుల ఉధృతి, వర్షాలు మరింత పెరగనున్నాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు కోస్తా భూభాగంలోనే తుఫాను పయనిస్తూ క్రమేపీ బలహీనపడనున్నదని ఒక అంచనా. దీనివల్ల కోస్తా, దానికి ఆనుకుని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో వర్షాలు పెరగనున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని నిపుణులు తెలిపారు. కాగా, అతి తీవ్ర తుఫాన్ తీరం దిశగా వచ్చే క్రమంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మంగళవారం గంటకు 160 నుంచి 180 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి తీరం దిశగా అలలు ఎగిసిపడుతున్నాయి. పలుచోట్ల సముద్రం ముందుకువచ్చింది. కాకినాడ రేవులో గ్రేట్ డేంజర్ సిగ్నల్ 10, భీమిలి, విశాఖపట్నం, గంగవరంలో 9, మచిలీపట్నం, నిజాంపట్నంలలో 8వ నంబరు హెచ్చరికలు ఎగురవేశారు. గ్రేట్ డేంజర్ సిగ్నల్స్ ఎగురవేయడం అంటే ఆ ఓడరేవులో అన్ని కార్యకలాపాలు నిలిచిపోయినట్టు. సముద్రంలో చేపల వేటను నిషేధించారు. మరో రెండురోజుల పాటు నిషేధం కొనసాగనున్నది. పలు జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచే వర్షం, గాలులు మొదలయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి గాలుల వేగం, వర్షం జోరు పెరిగింది. గంటకు 80 నుంచి 90 కి.మీ., అప్పుడప్పుడు 100 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. కోస్తాలో అనేకచోట్ల, ముఖ్యంగా ఉత్తరకోస్తాలో కుంభవృష్టి కురిసింది. ఉత్తరకోస్తాలో అనేకచోట్ల చెట్లు కూలిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ఉద్యానవన తోటలు ధ్వంసమయ్యాయి. కోతకు వచ్చిన వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కుండపోత వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాలు, కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవు వంటి తీర ప్రాంతాల్లో సముద్రం ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రాళ్లు పైకి లేచాయి. సముద్రపు కోత నివారణకు వేసిన బండరాళ్లు సైతం ముక్కలుగా మారి రోడ్డుపైకి చేరాయి. యానాం నుంచి కాకినాడ వరకు ఉప్పెన ఉపద్రవం తలెత్తే ప్రమాదం ఉందనే హెచ్చరికలతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాకినాడ జిల్లా అంతటా అంధకారం అలుముకుంది. సెల్‌టవర్లు సైతం ఒరిగిపోయాయి. వీటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అనేక సెల్‌టవర్లు పనిచేయక సిగ్నల్స్ నిలిచిపోయాయి. అల్లవరం వద్ద ఓఎన్జీసీ ప్లాంట్ ప్రహారీని సముద్రం తాకింది. గ్రామాల్లో అనేక రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. కోళ్లఫారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. యానాంలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. యానాం సావిత్రినగర్‌లో సముద్రపు నీరు 3 నుంచి 4 అడుగుల మేర పెరిగి ఇళ్లలోకి చేరింది. అక్కడ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్ అంతా నీరు చేరడంతో ప్రజలను మొదటి అంతస్తుకు తరలించారు. శ్రీకాకుళం జిల్లాలోనూ సముద్రం కొన్ని మీటర్లమేర ముందుకొచ్చింది. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోకి వర్షపు నీరు చేరడతో సిబ్బంది, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయనగరం జిల్లాలో 200 చెట్లు నేలకొరిగాయి, 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సహాయక చర్యల్లో భాగంగా విద్యుత్‌శాఖ అధికారులు 600 మంది సిబ్బందిని రంగంలోకి దించారు. వరి, పత్తి, చెరకు, బొప్పాయి, మునగ పంటలతో పాటు.. ఉద్యాన పంటలకు నష్టం కలిగింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోనూ పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచి పట్టణంతోపాటు గ్రామాల్లో అంధకారం అలముకొంది. చిన్న లంక, పీఎం లంక, తూర్పు తాళ్లు, వేములదీవి గ్రామాల్లో సుమారు మూడు వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అనకాపల్లి జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీవర్షం కురిసింది. పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

తెలంగాణలో కూడా తెగవర్షా లు !

కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీగా కురిసే అవకాశం

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రంలో బుధవారం వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం 8.30 గంటల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురియవచ్చని వెల్లడించింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలు... జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మిగతా జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. కాగా ఆంధ్రప్రదేశ్‌లో అర్నబ్ తుపాను కారణంగా సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమానాలకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను కారణంగానే విమానాలు రద్దయ్యాయని జీఎంఆర్ సంస్థ ప్రకటించింది. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చని ఎయిర్‌పోర్టు వర్గాలు చెబుతున్నాయి. తుపాను కారణంగా కోస్తాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం గోపాలకృష్ణన్‌తో కలిసి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. రైలు ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు ఐఆర్‌సీటీసీ, రైల్‌వన్, ఎన్‌టీఈఎస్ తదితర అధికారిక రైల్వే అప్లికేషన్ల నుంచి రైళ్ల ప్రస్తుత స్థితిని సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైళ్ల రద్దు/దారి మళ్లింపు సమాచారాన్ని రైల్వే సోషల్‌మీడియా సైట్‌ల నుంచి పొందవచ్చన్నారు. తుపాను కారణంగా మంగళవారమే 11 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అందులో 12704 ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 17016 విశాఖ ఎక్స్‌ప్రెస్, 12728 గోదావరి ఎక్స్‌ప్రెస్, 12862 మహబూబ్‌నగర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 12776 కోకనాడ ఎక్స్‌ప్రెస్, 17256 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, 12738 గౌతమి ఎక్స్‌ప్రెస్, 20810 నాగావళి ఎక్స్‌ప్రెస్, 07037/07038 చర్లపల్లి-శ్రీకాకుళం-చర్లపల్లి ప్రత్యేకరైళ్లు ఉన్నాయి.

వణికిస్తున్న చలి గాలులు

హైదరాబాద్‌లో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారు జామున ప్రధాన రహదారులను మంచు కప్పేస్తోంది. నాలుగు రోజులుగా శివారు ప్రాంతాల్లో చలి గాలులు వణికిస్తున్నాయి. పటాన్‌చెరులో మంగళవారం అత్యల్పంగా 13.2 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 18.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రోజుల పాటు వాతావరణం కొనసా గుతుందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నగరంలో రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందన్నారు.

అవకాశవాదులు అవసరం లేదు

కాంగ్రెస్ పాలనలో కరువు కోరల్లో తెలంగాణ..
రేవంత్ రెగ్యులర్ కాదు.. రెన్యువల్ సీఎం
కేసీఆర్ తిరిగి వస్తేనే రాష్ట్రం మళ్లీ గట్టెకుతది..
11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ
పదేండ్ల పాటు మంత్రి పదవిని అనుభవించి అధికారం పోగానే పార్టీ వీడిన ఇంద్రకరణ్‌రెడ్డి
అవకాశవాదులు పోయినా, పోరాటవాదులే బలం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
బీఆర్ఎస్‌లో చేరిన నిర్మల్ బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కండువాలు కప్పి ఆహ్వానం



ప్రజా దీవెన, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నయని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, రేవంత్ తన వైఫల్యాలతో ప్రజల నెత్తిన రుద్దిన కరువని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో సాగునీటి కొరత, విద్యుత్తు సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. నదుల్లో నీళ్లు పారుతున్నా వాటిని సాగుకు వినియోగించుకోకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని ఎప్పుడు చేసుకుందామా? అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని చెప్పారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంగళవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా సాగిందని గుర్తుచేశారు. ప్రజలు కొందరు వ్యవస్థ ఎట్లయినా నడుస్తుందనే ధోరణిలో ఉండగా, కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. మూడు నెలల్లోనే అన్నీ చేస్తామని చెప్పి మూడేండ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని దుయ్యబట్టారు.

నీళ్లెత్తాలని సూచించినా వినలే

2026న జూన్ 19న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించినప్పుడు అక్కడ లక్ష క్యూసెకుల నీరు దిగువకు ప్రవహిస్తున్నదని, పంపులు ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం పంపులు ఆన్‌చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పు అని తేలిపోతాయనే భయంతోనే రేవంత్‌రెడ్డి బటన్ నొకడం లేదని విమర్శించారు. దేవుడు తెలంగాణ ప్రజల కోసం నీళ్లు పంపిస్తే, మధ్యలో పూజారి రేవంత్ అడ్డుపడి బటన్ నొకకుండా అడ్డుకున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, తెలంగాణలో నీరందక పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు.

రేవంత్ రెన్యువల్ సీఎం

రైతుల కష్టాలను పరిషరించాల్సిన ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. నెలనెలా ఢిల్లీకి వెళ్లి ఈఎంఐ కట్టడానికే ముఖ్యమంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని దెప్పిపొడిచారు. ఢిల్లీలో ఈఎంఐ కడితేనే ముఖ్యమంత్రి పదవి రెన్యువల్ అవుతుందని ఎద్దేవాచేశారు. రైతులకు రైతుబంధు పడకపోయినా, రాహుల్ బంధు మాత్రం సమయానికి అందుతున్నదని దుయ్యబట్టారు. కరెంటు సరిగ్గా లేక, యూరియా దొరుకక, రైతుబంధు అందక అన్నదాతలు అరిగోస పడుతున్నారని వాపోయారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఒక ప్రయోగశాలగా, దోపిడీకి వేదికగా మార్చిందని మండిపడ్డారు.

కేసీఆర్ పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

సినిమా ఇంటర్వెల్ పూర్తయిందని, కేవలం ఒక సంవత్సరం మాత్రమే ఈ ప్రభుత్వ గడువు మిగిలి ఉన్నదని కేటీఆర్ పేరొన్నారు. తెలంగాణ తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణను ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేయాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని చెప్పారు. కేసీఆర్ పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ నగేశ్ గెలిచినా నియోజకవర్గానికి సాధించిందేమీ లేదని విమర్శించారు. పదేండ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్‌రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడారని, అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాటవాదులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని పేరొన్నారు.

11న నిర్మల్‌లో సభ

నిర్మల్‌లో రామచరణ్ నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఖానాపూర్‌కు చెందిన జాన్సన్ వంటి యువ నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. పార్టీలోకి వచ్చే వారందరినీ ఆహ్వానించాలని సూచించారు. నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ సభలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగించే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు బాల సుమన్, భూపాల్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ రాథోడ్, కందాల ఉపేందర్‌రెడ్డి, నాయకులు శ్యామ్ సుందర్, వడగంటి రమాదేవి, డాక్టర్ సుభాష్, రాము డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లే నిర్మల్ అభివృద్ధి

నిర్మల్ జిల్లా ఏర్పాటు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, మిషన్ భగీరథ నీళ్లు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం అన్నీ కేసీఆర్ హయాంలోనే జరిగాయని కేటీఆర్ గుర్తుచేశారు. నిర్మల్ ప్రాంతంలో సాగునీటి సదుపాయాల విస్తరణకు, ఇంటింటికీ తాగునీరు అందించడానికి తమ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. ప్రస్తుతం బీజేపీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లాకు ఏం ప్రయోజనం జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు ప్రజలను చీల్చడంలో, కాంగ్రెస్ నేతలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు.

అప్పులకుప్పగా సివిల్ సప్లై

లక్ష కోట్ల అప్పుల్లో సివిల్ సప్లయీస్
రూ.600 కోట్ల బియ్యాన్ని పందికొకుల పాల్జేసిండ్రు
ప్రజా ప్రభుత్వమంటూ సీఎం గొప్పలు
అధ్వానంగా ఉత్తమ్‌రెడ్డి శాఖ పనితీరు
రేషన్ డీలర్లను చర్చలకు పిలువాలి
గజ్వేల్‌లో రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి సమావేశంలో హరీశ్‌రావు

ప్రజా దీవెన, సిద్దిపేట : 'బిల్లుల కోసం నేను చనిపోవడానికి సిద్ధం అని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అంటుంటే, సమస్యల పరిషారం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజు అంటున్నారు.. కాంగ్రెస్ రాజ్యంలో చచ్చిపోతేనే బిల్లులు వస్తాయా? రేవంత్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ రూ.లక్ష కోట్ల అప్పుల్లో మునిగిపోయింది. 16 నెలలుగా గోదాములు, షాపుల్లో మూలుగుతున్న రూ.600 కోట్ల విలువైన దొడ్డు బియ్యాన్ని పురుగులు, పందికొకుల పాల్జేసిండ్రు' అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వంపై ఫైర్ అయ్యా రు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లోని బింగి ఎల్లయ్య గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సమావేశానికి హరీశ్‌రావు హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలివచ్చిన రేషన్ డీలర్లు ఎదురొంటున్న సమస్యలపై ఈ సమావేశంలోచర్చించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. రూ.100 కోట్లతో సీఎం కొత్త క్యాంప్ ఆఫీస్ కట్టుకోవడానికి, రూ.18 కోట్లతో ప్రహరీ కట్టడానికి, అందాల పోటీలకు, ఫుట్‌బాల్ షోలకు డబ్బులుంటాయి.. కానీ, 17,200 మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.10 కోట్ల గౌరవ వేతనం ఇవ్వడానికి పైసలు లేవా? అని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల ముందు రూ.5 వేల గౌరవ వేతనం, రూ.300 కమీషన్, మినీ సూపర్ మారెట్లు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి ఓట్లు వేయించుకుని.. మూడేండ్లు అవుతున్నా కనీసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తక్షణమే డీలర్ల సంఘాన్ని చర్చలకు పిలిచి హామీలు నెరవేర్చకపోతే అసెంబ్లీ, కౌన్సిల్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. తమ సమస్యలు పరిషారం కాకపోతే ఆమరణ దీక్ష చేస్తామని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు అనడం తనను కదిలించిందని అన్నారు.

నిన్ననే జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 'మంత్రుల నియోజకవర్గాలకే నిధులు పోతున్నాయి. జడ్చర్లలో రోడ్లు పగుళ్లు పడ్డా దా దాపు రూ.40 కోట్ల బిల్లులు కూడా రావడం లేదు. ఒక కాంట్రాక్టర్ చనిపోతే రూ.5 కోట్ల బిల్లు పడింది. నేను చనిపోతేనే మా నియోజకవర్గ బిల్లులు వస్తాయంటే.. ప్రాణత్యాగానికి సిద్ధం' అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అసలు రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే.. చనిపోతేనే పనులు అవుతాయా? చచ్చిపోతేనే బిల్లులు వస్తాయా? అధికార పార్టీ ఎమ్మెల్యేనే చచ్చిపోవడానికి సిద్ధమనే దుస్థితి వచ్చిందని అన్నారు.

ఇదేం ప్రజాపాలన?

ప్రజలను ఎప్పుడైనా కలిసేదే ప్రజా ప్రభుత్వం కదా! మరి 17,200 మంది రేషన్ డీలర్లు ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడికే మూడేండ్లలో అపాయింట్‌మెంట్ దొరక్కపోతే ఇదెకడి ప్రజాపాలన? అని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లలో లక్ష టన్నులు, రేషన్ షాపుల్లో 40 నుంచి 50 వేల టన్నుల దొడ్డు బియ్యం మూలుగుతున్నదని దుయ్యబట్టారు. ఆ బియ్యాన్ని అమ్మితే వచ్చే రూ. 600 కోట్లతోనే డీలర్ల కమీషన్ పెంపు, గౌరవ వేతనం ఇచ్చేయవచ్చు కదా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీ కాంత్, ధరావత్ మోహన్ నాయక్, అజీజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

100 ఎమ్మెల్యే సీట్లే మా టార్గెట్

రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్సే.. కేటీఆర్, హరీశ్ భ్రమల్లో ఉన్నారు: మహేశ్‌గౌడ్

ప్రజా దీవెన, హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో వంద అసెంబ్లీ నియోజకవర్గాలో గెలుపే తమ టార్గెట్ అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావులు ఇంకా భ్రమల్లోనే ఉన్నారని, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను వారు తెలుసుకోవట్లేదన్నారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఎంతో స్వేచ్ఛ ఇచ్చారని, తమకు ఉన్నంత సమన్వయం దేశంలో ఎక్కడా లేదన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, పార్టీ ఎమ్మెల్యేలు చురుకుగా పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ఇప్పట్లో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 8 మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా మళ్లీ గెలవబోరన్నారు. కేసీఆర్ మేధావి అని అనుకుంటారని, కానీ ఆయన ఆలోచన లేకుండా అప్పులు చేశారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉందని, కానీ హరీశ్‌రావు పిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను మీడియాలో చూశానని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

ఆర్టీసీ విలీనం కోసం ప్రభుత్వంతో చర్చిస్తాం

సీసీఎస్ ఎన్నికల్లో సత్తా చూపిస్తాం: రాజిరెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: బొంతు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటమి ఎదురైనా కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని ఆర్టీసీ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతోపాటు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామని, సమస్యల పరిష్కారానికి అవసరమైతే పోరాటాలు చేస్తామని, ఆర్టీసీ సీసీఎస్ ఎన్నికల్లో సత్తా చాటుతామని పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో టీడబ్ల్యూయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల సమీక్ష సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో తమ యూనియన్‌కు మద్దతుగా 14 వేల మంది కార్మికులు ఓటు వేశారని తెలిపారు. మొత్తం 49 డిపోల్లో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టంతో జర్నలిజానికి సమాధే!

అవినీతిపరుడి గురించి రాయాలంటే అతడి అనుమతి తీసుకోవాలా?

పరిశోధనాత్మక రిపోర్టింగ్ చేయలేని పరిస్థితి నెలకొంటుంది

'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ' చట్టంపై వార్తాసంస్థల అభ్యంతరం

కొన్ని నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకం.. వాటిని కొట్టేయాలి

కేంద్రానికి కోర్టు నోటీసులు

'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ' చట్టంపై సుప్రీంలో డిజిటల్ వార్తా సంస్థల పిటిషన్



న్యూఢిల్లీ: సమాచారాన్ని ప్రచురించేముందు సంబంధిత వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న 'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ' (డీపీడీపీ) చట్టం, నిబంధనలతో వార్తాసంస్థలను మూసుకోవాల్సి వస్తుందని దేశంలోని ప్రముఖ డిజిటల్ న్యూస్ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఒక వ్యక్తి దుష్ప్రవర్తన, అవినీతి గురించి వార్తలు రాయాలనుకున్న విలేకరిని.. ముందుగా సదరు వ్యక్తి అనుమతి తీసుకొనిగానీ రాయటానికి వీల్లేదంటే ఇక జర్నలిజం ఉనికిలో ఎలా ఉంటుందని ప్రశ్నించాయి. 21 సంస్థలతో కూడిన 'డిజిటల్ న్యూస్ సంస్థల సంఘం' ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ సంఘంలో అదానీ, అంబానీలకు చెందిన మీడియా సంస్థలు ఎన్‌డీటీవీ, న్యూస్ 18 కూడా ఉండటం విశేషం. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ మోహనలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. డీపీడీపీ చట్టం అమలును ఇప్పటికిప్పుడు నిలిపివేయలేమన్న ధర్మాసనం.. అభ్యంతరాలపై తొలుత కేంద్రం స్పందనను తెలుసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 17వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా 'డిజిటల్ న్యూస్‌సంస్థల సంఘం' తరఫున సీనియర్ అడ్వకేట్ మాధవి దివాన్ వాదనలు వినిపించారు. డీపీడీపీ చట్టం నుంచి విలేకరులకు మినహాయింపు ఇవ్వకపోవటం వల్ల వార్తా సేకరణపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇది ప్రెస్ మీద ముందస్తు సెన్సార్ (ప్రీ సెన్సార్) విధించటం లాంటిదేనన్నారు. ఇంతకుముందున్న సంబంధిత చట్టాల్లో జర్నలిస్టులకు మినహాయింపు ఉందని, దానిని ప్రభుత్వం ఎందుకు తొలగించిందని ప్రశ్నించారు. ఈ చట్టం అమలైతే పరిశోధనాత్మక జర్నలిజం, రిపోర్టింగ్ వంటివి సాధ్యం కావని.. ఈ నేపథ్యంలో డీపీడీపీ చట్టంలోని పలు సెక్షన్లను, వాటికి అదనంగా నోటిపై చేసిన నిబంధనలను రాజ్యాంగవిరుద్ధమైనవిగా ప్రకటిస్తూ వాటిని కొట్టేయాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8(1)లో తీసుకొచ్చిన 'క్లాజ్ జీ'ని కూడా రాజ్యాంగ విరుద్ధమైనదిగా మాధవి దివన్ పేర్కొన్నారు.

డీపీడీపీ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల జరిమానా

'డిజిటల్ పర్సనల్ డేటా పరిరక్షణ'కు సంబంధించి 2023 ఆగస్టులో కేంద్రప్రభుత్వం డీపీడీపీ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ఏ వ్యక్తికి సంబంధించిన సమాచారాన్నైనా ఒక సంస్థ సేకరించటానికి, వినియోగించుకోవటానికి ముందు ఆ వ్యక్తి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 7లో పేర్కొన్న 'చట్టబద్ధమైన ఉపయోగాలకు' మాత్రమే ఆ వివరాలను వాడుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ గతేడాది నవంబరు 13వ తేదీన ప్రకటించింది.

నా జీవితకథ నాతోనే వెల్లడి

నా పుస్తకం విడుదలయ్యాక రచ్చ తప్పదేమో!

ఇతరులు నా గురించి ఏవేవో రాశారు

నా జీవిత కథను నేనే చెప్పాల్సిన సమయం వచ్చింది

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: రాజీవ్ గాంధీ ప్రధాని కావడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని ఆయన భార్య, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చెప్పారు. తన జీవితంపై ఇన్నాళ్లూ ఇతరులు అనేక విషయాలు రాశారని, వాటిలో కొన్ని వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, మరికొన్ని అతిశయోక్తులు ఉన్నాయని తెలిపారు. ఇక తన జీవిత కథను తానే చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. తన జ్ఞాపకాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం విడుదలైన తర్వాత పెద్ద చర్చ, రచ్చ జరిగే అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. తన పుస్తకం గురించి తాజాగా సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో సోనియా ఈ వ్యాఖ్యలు చేశారు. పుస్తకం చదివిన తర్వాత కొందరికి తనపై ఉన్న అభిప్రాయం మారవచ్చన్నారు. మరికొందరి అభిప్రాయం ప్రతికూలంగా మారే అవకాశం కూడా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ఇలాంటి పరిణామాలు సహజమని అన్నారు. 1984లో ఇందిరా గాంధీ హత్యకు గురైన అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. 1991లో ఎన్నికల ప్రచారంలో రాజీవ్ హత్యకు గురయ్యారు. ఆయన రాజకీయాల్లోకి రావడం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం తమ కుటుంబంలో కీలక పరిణామాలని సోనియా అన్నారు. కాగా, సోనియా రాసిన ఈ 544 పేజీల పుస్తకం నవంబరు 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

జ్ఞానేశ్ తప్పుకోవాలి.. లేదంటే తప్పించాలి

ఏదో ఒకటి జరిగేదాకా ఉద్యమం ఆగదు

విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టీకరణ

విపక్ష నేత రాహుల్‌గాంధీ హెచ్చరిక

రామ్‌లీలాలో ర్యాలీని అడ్డుకుంటే మోదీ,షా, జ్ఞానేశ్ ఇళ్ల వద్ద ధర్నా: కాంగ్రెస్

న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయడం, లేదంటే ప్రధాని మోదీ ఆయనను తప్పించడం జరిగేదాకా ఉద్యమం ఆగదని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. సర్, జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి నవంబరు 1న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. స్వరాజ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్, సీపీఐ(ఎం.ఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్యతో కలిసి ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో జరిగిన 'జన్ సున్వాయి' కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నారు. 'సర్' బాధితుల వినతులను స్వీకరించారు. త్రిలోక్‌పురిలోని నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఓట్లను 'సర్' పేరిట ఓటరు జాబితానుంచి అక్రమంగా తొలగించారని ఈ సందర్భంగా రాహుల్ ఆరోపించారు. "అక్రమంగా ఓట్లను తొలగించడంపై మా ప్రశ్నలకు జ్ఞానేశ్‌కుమార్ సమాధానం ఇవ్వడం లేదు. కానీ, మేం ఆయనను వదిలిపెట్టం. సీఈసీ తీరుతో దేశంలో కోట్లాదిమంది తమ ఓటు హక్కు కోల్పోయారు. ఓటు హక్కు సహా సకల హక్కుల్నీ పేదలు కోల్పోతున్నారు. ఎంపిక చేసిన సంపన్నులతో కూడిన కొత్త భారతదేశ నిర్మాణం కోసం ప్రయత్నం జరుగుతోంది. అక్కడ పేదలకు ఎలాంటి హక్కులూ ఉండవు. సంపన్నులకే అక్కడ అన్నీ పరిమితం" అని రాహుల్ ఆరోపించారు. కాగా, ప్రజా ఉద్యమాన్ని అణచబోయి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తమ ప్రతిష్ఠను తానే దిగజార్చుకుంటున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. సీఈసీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నా, ఎందుకు జ్ఞానేశ్‌ను వెనుకేసుకుని వస్తున్నారని 'ఎక్స్' వేదికగా ఖర్గే ప్రశ్నించారు. మరోవైపు, నవంబరు 1ఆందోళనకు సన్నాహంగా ఈ నెల 30న జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అశోక్ హోటల్‌లో ముందు అనుమతి ఇచ్చి ఆ తర్వాత రద్దు చేశారని చెప్పారు. ఇండియా కూటమి ఆందోళన కోసం ఈ నెల 25నుంచి నవంబరు 3 వరకు బుక్ చేసిన రామ్‌లీలా మైదానంలో ఈ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని ప్రకటించారు. అయితే, రామ్‌లీలా మైదానంలో కూడా పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, అక్కడ వేదిక నిర్మాణం కోసం వెళ్లిన తమ కార్యకర్తలను అడ్డుకున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. ఒకవేళ రామ్‌లీలాలో కార్యక్రమం జరగనీయకపోతే, ధర్నా వేదికను అమిత్‌షా, మోదీ, జ్ఞానేశ్ ఇళ్ల ముందుకు మార్చుతామని హెచ్చరించారు.

ర్యాలీకి షరతులతో అనుమతి: పోలీసులు

రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. అయితే, ఈ అనుమతి షరతులకు లోబడి ఉంటుందన్నారు. భూ యాజమాన్య సంస్థ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రిపూట మైదానంలో బస చేయకూడదని, అనుమతి ఇచ్చిన ప్రాంతంలో తప్ప మరెక్కడా పాదయాత్ర చేపట్టకూడదని అన్నారు.

11వేల ఇంజెక్షన్‌కు.. 1.30 లక్షలా!

ఇది వ్యాపారమా.. నిలువు దోపిడీయా?

ప్రైవేటు ఆస్పత్రులు, కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని, ప్రైవేటు ఆస్పత్రులు మందుల విక్రయాలపై భారీగా దోచుకుంటుండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డీలర్‌కు రూ.11వేలకు లభించే క్యాన్సర్ ఇంజెక్షన్‌ను రోగికి రూ.1.30 లక్షలకు విక్రయించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఇంతటి దోపిడీని ఎలా సమర్థించుకుంటారని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం నిలదీసింది. మందుల ధరలను నియంత్రించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై, మంగళవారం మరోసారి వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. తన తీర్పును రిజర్వ్ చేసింది. విచారణ సందర్భంగా ఒక క్యాన్సర్ రోగి ఉదంతాన్ని ప్రస్తావించింది. "మందుల వ్యాపారం చేసే ఓ వ్యక్తి భార్య ప్రైవేటు ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స కోసం చేరారు. కీమోథెరపీలో భాగంగా ఇచ్చే ఇంజెక్షన్ డీలర్ ధరపై తనకు రూ.11వేలకే లభిస్తుందని.. తాను బయటి నుంచి తెస్తానని ఆ వ్యాపారి చెప్పారు. అందుకు ఆస్పత్రి యాజమాన్యం ఒప్పుకోకపోగా.. అదే ఇంజెక్షన్‌కు ముక్కుపిండి రూ.1,30,000 వసూలు చేసింది. ఈ దోపిడీని మీరు ఎలా సమర్థించుకుంటారు? రోగులు ప్రాణాలతో ముడిపడిన విషయంలో ఇంటి వ్యాపార ధోరణి పనికిరాదు"అని వ్యాఖ్యానించింది. అయితే, మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సవరిస్తోందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యభాటి కోర్టుకు తెలిపారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. రూ.11వేల మందును రోగికి రూ.1.30 లక్షలకు విక్రయించడం ధరల నియంత్రణ ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది. క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. మార్కెట్లో 90 శాతం మందులు ఔషధ ధరల నియంత్రణలకు వెలుపలే (డీపీసీవో) ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

జవహర్ నగర్‌పై జవాబేది

కాలుష్యం పేదల ప్రాణాలను హరిస్తున్నా పట్టదా?..

విష రసాయనాలతో అనేక రకాల వ్యాధులు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం

యార్డును తరలించాలంటూ పాదయాత్ర ప్రారంభం

పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ప్రజా దీవెన, హైదరాబాద్: జవహర్ నగర్ కాలుష్యంపై సీఎం రేవంత్‌రెడ్డి నాడు ఎంతో ఉద్యమం చేసి నేడు మౌనం వహించడం తగదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని మంగళవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎదులాబాద్ నుంచి ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జవహర్ నగర్ డంపింగ్ యార్డు విష రసాయనాలతో అనేక రకాల వ్యాధులు సోకుతూ పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు కారణంగా పర్యావరణం పూర్తిగా దెబ్బతింటున్నదన్నారు. రూ.వేల కోట్లు వెచ్చించి మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేవలం రెండు మూడు వందల కోట్లతో పరిష్కారం అయ్యే జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యను విస్మరించడం తగదన్నారు. ప్రశ్నించే గొంతుకను కాపాడుకోవాలనే నినాదంతో ప్రజల్లోకి వచ్చిన ఆయన వారికి ఎంతో మేలు చేస్తాడని ఆశించినట్లు గుర్తు చేశారు. పాదయాత్రలో భాగంగా ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని బొక్కోనిగూడ వద్ద వరి ధాన్యం ఎండబోసిన రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎరిమల్లెవాగులో కలుస్తున్న కాలుష్య జలాలతో ధాన్యం రంగు మారుతున్నదని, దీంతో అధికారులు తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని రైతులు ఎంపీకి మొర పెట్టుకున్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : రాంచందర్ రావు

జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొని మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు కాలుష్యం నివారణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. గతంలో ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువు నీటిని ప్రజలు తాగేవారని గుర్తుచేశారు. నాటి చెరువులు, కుంటలు, వాగులు, కాల్వలు నేడు పూర్తిగా విషతుల్యమై ఎందుకూ పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరిగిపోతున్న జల, వాయు కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వచ్చే నెల రెండున కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌కు వచ్చి ట్యాంక్‌బండ్ వద్ద జరిగే పార్టీ ఆందోళన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యాదాద్రి రెండో దశకు ఒడిసా, బెంగాల్‌ల బొగ్గు

ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు

ప్రజా దీవెన, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీగటీఎస్)లోని రెండో దశలోని 1600 మెగావాట్ల ప్లాంట్లకు కోల్ ఇండియాకు చెందిన అనుబంధ కంపెనీలు ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ (పశ్చిమబెంగాల్), మహానది కోల్ ఫీల్డ్(ఒడిసా) నుంచి బొగ్గు అందనుంది. యాదాద్రిలో మొత్తం 4వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు ప్లాంట్లు ఉండగా అందులో మొదటి దశలో మూడు యూనిట్లకు సింగరేణి నుంచి బొగ్గు అందనుంది. రెండో దశలోని రెండు యూనిట్లకు ఈసీఎల్, ఎంసీఎల్‌ల నుంచి బొగ్గు లింకేజీ ఇస్తూ కోల్ ఇండియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఈసీఎల్, ఎంసీఎల్‌లను సంప్రదించి వాణిజ్యపరమైన లాంఛనాలన్నీ పూర్తిచేసి, ఇంధన సరఫరా ఒప్పందం (ఎఫ్ఎస్ఏ) చేసుకోవాలని తెలంగాణ జెన్‌కోకు సూచించింది. తాజా ఉత్తర్వులతో 1600 మెగావాట్లలో 320 మెగావాట్లకు సరిపడా జీ-8 రకం బొగ్గును ఏటా 1.146 మిలియన్ టన్నులు ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ అందించగా... 1280 మెగావాట్ల విద్యుత్తు అవసరాలు తీర్చేలా జీ-13 రకం బొగ్గును 6.566 మిలియన్ టన్నులను మహానది కోల్ ఫీల్డ్(ఎంసీఎల్) సరఫరా చేయనుంది. మొత్తంగా 7.712 మిలియన్ టన్నుల బొగ్గును కోల్ ఇండియా కంపెనీల నుంచి యాదాద్రికి రానుంది. రెండో దశలోని రెండు యూనిట్లకు బొగ్గును ఇవ్వలేమని, బయటి నుంచి సర్దుబాటు చేసుకోవాలని సింగరేణి పలు దఫాలుగా లేఖలు రాసింది. దాంతో బొగ్గు కొరతకు తోడు... ప్లాంట్ నిర్మాణంలో లోపాల వల్ల పూర్తిస్థాయిలో యాదాద్రిలో విద్యుదుత్పాదన జరగలేదు. ఫలితంగా గత సెప్టెంబరు 28వ తేదీన, మళ్లీ ఈనెల 21వ తేదీన కేంద్రబొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన స్టాండింగ్ లింకేజీ కమిటీ (లాంగ్ టర్మ్) సమావేశం జరగ్గా... ఆ సమావేశంలోనే జెన్‌కోకు బొగ్గును ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. తాజా నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వంతో పాటు జెన్‌కో చేసిన ప్రయత్నాలు ప్రతిఫలించినట్లయ్యాయి.

ఇద్దరు కూతుళ్లతో కలిసి మంజీరాలో దూకిన తల్లి

గాలిస్తున్న పోలీసులు.. మెదక్ జిల్లా చిన్నఘనాపూర్‌లో ఘటన

కొల్చారం, అక్టోబరు 27: మంజీరా నదిలో దూకి మహిళ, ఆమె ఇద్దరు కుమార్తెలు గల్లంతైన విషాద ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన సరిత (25) భర్త గతంలోనే మృతిచెందగా.. తన ఇద్దరు కుమార్తెలు వైష్ణవి, శ్రావణితో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటూ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. మంగళవారం సరిత తన ఆధార్ కార్డులో సవరణకోసం కొల్చారంలో ఉంటున్న అక్క వద్దకు వచ్చింది. సాయంత్రం ఏడుపాయల సమీపంలోని మంజీరా ఒడ్డుకు చేరుకున్న సరిత.. పిల్లలతో కలిసి నదిలో దూకుతున్నట్లు తన తండ్రి బాలకృష్ణకు ఫోన్‌చేసి చెప్పింది. దీంతో అతడు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు సరిత సెల్‌ఫోన్ సిగ్నల్ ఏడుపాయల మొదటి వంతెన వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మెదక్ సీఐ కృష్ణమూర్తి, కొల్చారం ఎస్సై మొహినుద్దీన్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకోగా.. వంతెన సమీపంలో నది ఒడ్డున సరిత, ఆమె కుమార్తెల చెప్పులు, సెల్‌ఫోన్ లభించాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో రెండు గంటల పాటు నదిలో విస్తృతంగా గాలించినా ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. బుధవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

చిత్తలూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి


-సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నిరసన



శాలిగౌరారం : శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో నిర్మించి పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సిలువేరు జానయ్య డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంచడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట గ్రామ ప్రతినిధులతో కలిసి నిరసన చేపట్టి, ఏఓ మోతిలాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్తలూరులో సుమారు 3 వేల మంది జనాభా ఉన్నారని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఈ ఉపకేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని ఇలా పాడుబెట్టడం సరికాదని, గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నచిన్న అనారోగ్యాలకు కూడా దూర ప్రాంత ఆసుపత్రులకు వెళ్లాల్సి రావడంతో పేద, వ్యవసాయ కూలీ కుటుంబాలకు సమయం, డబ్బు వృథాతో పాటు భారం అవుతోందన్నారు. ఉపకేంద్రం ప్రారంభిస్తే ప్రాథమిక పరీక్షలు, సాధారణ చికిత్స, గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య సేవలు స్థానికంగానే అందుతాయని తెలిపారు. వెంటనే ఉపకేంద్రాన్ని ప్రారంభించి, సిబ్బందిని నియమించి, మందులు, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల శంకర్, అంబటి నర్సయ్య, శంబయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి సన్నిధిలో ఘనంగా 219వ అన్నప్రసాద వితరణ

దేవరశెట్టి హనుమంతరావు సేవలు అభినందనీయం....



ప్రజా దీవెన, కోదాడ : పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం 219వ అన్నప్రసాద వితరణ కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. సాయికృష్ణ, చంద్రమౌళిచారి, నాగరాజుతో పాటు నెలవారీ చందాదారులు ఈ కార్యక్రమానికి దాతలుగా నిలిచారు. ఈ వేడుకలో సుమారు 380 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.గత నాలుగున్నరేళ్లుగా భక్తులు, దాతల సహకారంతో ఈ సేవ నిరంతరం కొనసాగుతుండటం విశేషం. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు జూకూరి అంజయ్య అధ్యక్షతన అన్నదానం కొరకు నిరంతరం శ్రమిస్తున్న నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆకుల పుల్లారావు, తిరుపతయ్య, వి. రామారావు, పెద్ది శేషు, మధు, ఉమామహేశ్వరరావు, శిరీష, శ్రీనివాసరావు, రవీంద్ర, లక్ష్మయ్య, నరేష్, కృష్ణమూర్తి, బ్యాటరీచారి, బి.ఎల్.ఎన్. రెడ్డి, సత్యం, డాక్టర్ శ్రీకాంత్, నాగమణి, రంగా శ్రీను, ప్రకాష్, అప్పారావు, లక్ష్మారెడ్డి, గాంధీ, రాంప్రసాద్, పవన్, రామకృష్ణ, అర్చకులు వెంకటకృష్ణ, విశాల్ మిశ్రా తదితర ప్రముఖులు పాల్గొన్నారు.....

సర్ ప్రక్రియలో ధ్రువపత్రాల పరిశీలన ప్రధానమైనది

జిల్లా ఓటరు జాబితా పరిశీల కురాలు, రాష్ట్ర కళాశాల, సాంకే తిక విద్య కమిషనర్ శ్రీదేవసేన





ప్రజా దీవెన, నల్లగొండ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఫారా లు,ధ్రువపత్రాల పరిశీలన ము ఖ్యమని నల్గొండ జిల్లా ఓటరు జాబితా ఎన్నికల పరిశీల కురా లు మరియు రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదే వ సేన అన్నారు. కొత్తఓటర్ల నమో దు, ఓటరు జాబితాలో తొలగిం పులు ,మార్పుచేర్పులను జాగ్రత్త గా పరిశీలించి చేయాలని చెప్పా రు.మంగళవారం ఆమె నల్గొండ జిల్లా మునుగోడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలోని 171 వ పోలింగ్ కేంద్రంలో "సర్" ప్రక్రియను పరిశీలించారు. బిఎల్ఓ పద్మ తో ముఖాముఖి మాట్లాడుతూ సర్ ప్రక్రియ నిర్వ హణ తీరును అడిగి తెలుసుకు న్నారు. సర్ లో భాగంగా ఓటరు నమోదు,ఫారాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చే ర్పులకు వచ్చిన ఫారాలు,జారీ చేసిన నోటీస్ లు గురించి అడిగా రు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్ షెడ్యూలు ధ్రువ ప త్రాలు పరిశీలించిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఓటరు నమోదుకై ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు ,వాటి పరిశీ లన ధ్రువ పత్రాల పరిశీలన, మ్యాపింగ్ కానీ ఓటర్ల విషయం లో తీసుకున్న నిర్ణయాలు, ధ్రువ పత్రాల ఆధారంగా ఇల్లిల్లు పరిశీ లన, ఎలా నిర్ధారణ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటరు జాబితా నుండి తొలగిం పులు ఏ విధంగా చేస్తున్నారని? ఒక ఓటరు కు రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే ఒకేసారి రెండు చో ట్ల తొలగించకుండా ఒకచోట ఓ టరు గా కొనసాగేందుకు వీలై నం తవరకు నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు. ఓటరు జాబితాలో విఐపి ఓట ర్లు తప్పనిసరిగా ఉండేలా చూ డాలని ఈ వివరాలన్నీ ప్ర త్యే కం గా నమోదు చేయాలని, నోటీసు లు జారీ చేసిన ఓటరుకు హియ రింగ్ తర్వాత ఓటరు జాబితాలో తన పేరు తిరస్కరించిన లేదా అ నుమతించిన వివరాల న్నింటిని తప్పనిసరిగా తెలియ జేయాలని చెప్పారు. నోటీస్ లు జారీ చేసిన ఓటర్లకు హియరింగ్ తర్వాత త న పేరు ఓటరు జాబి తాలో ఉ న్నది లేనిది ఇంటికి వెళ్లి తెలియ జేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చం ద్రశేఖర్ తెలిపారు. రెవెన్యూ అ దనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవ రకొండ సబ్ కలెక్టర్ కరోలిన చిం గ్ థియాన్ మావి, చండూర్ ఆర్డీ వో శ్రీదేవి, మునుగోడు తహసిల్దా ర్ , ఆర్ఐ,తదితరులు ఉన్నారు . చండూరు : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావా ల్సిన అవసరం ఉందని, ఈ విష యంలో రాజకీయ పార్టీల ప్రతిని ధుల పాత్ర చాలా ముఖ్యమని న ల్గొండ జిల్లా ఓటరు జాబితా పరి శీలకురాలు, రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీ దేవ సేన అన్నారు.మంగళవారం ఆ మె నల్గొండ జిల్లా, చండూరు ఆ ర్డీవో మరియు మునుగోడు ఈ ఆ ర్ఓ కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ ప్రక్రియ పై ఏ ర్పాటు చేసిన సమావేశంలో మా ట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా చూడడంలో అధికారులతో పాటు, రాజకీయ పార్టీల పాత్ర ముఖ్యమని అన్నారు. సర్ ప్రక్రి యలో అధికారులతో కలిసి పని చేయాలని రాజకీయ పార్టీల ప్రతి నిధులతో కోరారు. ఇందులో భా గంగా ఎన్నికల కమిషన్ షెడ్యూ ల్ ప్రకారం సర్ ఫారాలపై వచ్చిన అభ్యంతరాలను నవంబర్ 5 వర కు పరిష్కరించేందుకు అవకాశం ఉందని, ఇంకా ఎక్కడైనా అర్హు లైన వారు ఓటరుగా నమోదు కు అవకాశం ఉంటే రాజకీయ పార్టీ ల ప్రతినిధులు అలాంటి వారంద రిని గుర్తించి ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. అర్హులు ఏ ఒక్కరు ఓటరు జా బితా నుండి తప్పిపోకూడద న్నారు.రాజకీయ పార్టీలు ఇంకా ఎక్కడైనా బిఎల్ఏ లను నియ మించకుంటే వెంటనే నియమిం చాలని కోరారు. రాబోయే వారం రోజులు సర్ ప్రక్రియలో అర్హులైన వారందరూ ఓటరుగా నమోద య్యేలా పక్కాగా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆమె ప్రతివారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి హాజరవుతున్నారా? ఓటరు జా బితాలో చనిపోయిన, తొలగిం చిన వారి పేర్లను చూసుకున్నా రా? లేదా అని అడిగి రాజకీయ పార్టీల ప్రతినిధులను తెలుసుకు న్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మునుగోడు ని యోజకవర్గంలో సర్ ప్రక్రియ ప కడ్బందీగా జరిగిందని, ప్రతివా రం క్రమం తప్పకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించారని ,సర్ పై తమకు వచ్చిన సందేహాలన్నింటిని ఈ ఆర్ ఓ,ఆర్డిఓ ఎప్పటికప్పుడు తీ ర్చారని, సర్ ప్రక్రియలో ఈఆర్వో, ఏఈఆర్ఓ లందరు బాగా కృషి చేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మా ట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగం గా మునుగోడు నియోజకవర్గా నికి సంబంధించి అన్ని హియరిం గ్స్ ను పూర్తి చేయడం జరిగింద ని, వచ్చిన ఫారం 6 ,7, 7 ఏ ప రిశీలించామని,అన్ కలెక్టెడ్ ఫా రాలన్నింటిని బిఎల్ఏ ల సమక్షం లో పరిశీలించడం జరిగిందని, ఫారం 6,7,8 లపై వచ్చిన అ భ్యంతరాలను నవంబర్ 5 న ప రిష్కరించేందుకు చివరి తేదీగా ఈసీ నిర్ణయించడం జరిగిందని, నవంబర్ 9న తుది ఓటరు జాబి తా ప్రచురించడం జరుగుతుంద ని తెలిపారు. మిగిలిపోయిన అ భ్యంతరాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఓటరు జాబితా పరిశీలకురాలికి వివరిం చారు.అనంతరం ఓటరు జాబి తా పరి శీలకురాలు జిల్లాలోని ఈఆర్వో లు, ఏఈఆర్ఓ లతో సర్ ప్రక్రియ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఫారం 6,7,7ఏ,8 లను వివిధ స్థాయిలలో చేసిన తనిఖీ , ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్ల అవసరం ,ఆన్లైన్లో ఎప్పటికప్పు డు ఓటరు జాబితా సవరణ, త దితర అంశాలపై సమీక్షించారు. అలాగే వివిధ పారాలపై వచ్చిన అభ్యంతరాలపై ఏర్పాటు చేసిన హియరింగ్స్ కు ఓటర్లకు సరైన సమయం ఇచ్చింది లేనిది అడిగి తెలుసుకున్నారు. సర్ ప్రక్రియకు సంబంధించి రికార్డులన్నింటినీ జాగ్రత్తగా నిర్వహించాలని, బిఎ ల్ఓ యాప్ లో అన్ని వివరాలు నమోదు అయ్యేలా చూడాలని , రెండు చోట్ల నమోదైన ఓటర్ల వివ రాలను మరోసారి తనిఖీ చేయా లని, ఫోటో ఓటరు గుర్తింపు కా ర్డుల పంపిణీ, తదితర వివరాల ను అడిగి తెలుసుకున్నారు. అం తేకాక సర్ ప్రక్రియ మొత్తం పూర్తి జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడ త ప్పులు జరగకుండా చూసుకోవా లని, పూర్తి పారదర్శకంగా చేయా లని, సర్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలన్న దే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దే శం అని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఈ ఆర్ ఓ దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియా న్ మావి, నల్గొండ ఈఆర్వో , ఆర్డి ఓ వై. అశోక్ రెడ్డి, మిర్యాలగూడ ఈఆర్ఓ ,ఆర్డిఓ రమణారెడ్డి, చం డూర్ ఆర్డిఓ మరియు మునుగో డు ఈఆర్వో శ్రీదేవి, ఆయా ని యోజకవర్గాలఏ ఈ ఆర్ ఓ లు, తహసిల్దార్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.





పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి

నల్లగొండలో బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా దీవెన,నల్లగొండక్రైమ్: దేశ రక్షణలో, ప్రజల ప్రాణాలు మరియు ఆస్తుల పరిరక్షణలో విధి నిర్వహణ చేస్తూ ప్రాణాల ర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ న ల్లగొండ పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీ స్ అమరవీరుల సంస్మరణ వారో త్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై న ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చం ద్ర పవార్ మాట్లాడుతూ దేశవ్యా ప్తంగా ఈ ఏడాది 154 మంది, తె లంగాణలో నలుగురు పోలీసు లు విధి నిర్వహణలో అమరుల య్యారని తెలిపారు. వారి త్యా గాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరి రక్షణ, ప్రజల భద్రత కోసం పో లీ సులు అనేక సవాళ్లు, ప్రమాదా లను ఎదుర్కొంటూ నిరంతరం వి ధులు నిర్వర్తిస్తున్నారని చెప్పా రు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరు ల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూ ర్తి దాయకమని, వారి ఆశయాల ను కొనసాగిస్తూ ప్రజలకు మరిం త మెరుగైన సేవలు అందించడ మే వారికి అర్పించే నిజమైన ని వాళి అని ఎస్పీ స్పష్టం చేశారు.

పోలీసుల సేవలపై ప్రజల్లో అవ గాహన

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం అ మరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, పోలీ సుల విధి నిర్వహణలో ఎదు ర య్యే సవాళ్లపై అవగాహన క ల్పించడమేనని ఎస్పీ వివరిం చారు. ప్రజలు పోలీసులకు సహ





కరించాలని, చట్టాలను గౌరవి స్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు బాధ్య తను నిర్వర్తించాలని పిలుపుని చ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుం చి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్ జీ కళాశాల, రామగిరి, క్లాక్ ట వర్ మీదుగా కొనసాగింది. పో లీ స్ అమరవీరుల సేవలు, త్యా గా లను స్మరించుకుంటూ సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో పోలీసుల విధుల పట్ల అవగాహన పెంపొందించేలా నిర్వహించారు.అమరవీరుల సం స్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ వివిధ అవగా హన కార్యక్రమాలను చేపడుతోం ది. దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసుల సేవలను గుర్తుంచుకో వడం, వారి కుటుంబాల త్యాగా లను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీస్ శాఖ పేర్కొంది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, 12వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగే శ్వ రరావు, నల్లగొండ డీఎస్పీ శివ రాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివా సులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ ఐ లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

గౌరవ వేతనం రూ.5 వేలు, క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇవ్వాలి

నల్లగొండ జిల్లా కేంద్రంలో డీలర్ల భారీ ర్యాలీ



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: రేషన్ డీలర్ల దీర్ఘకాలిక సమస్యల ను ప్రభుత్వం ఇకనైనా పరిష్క రించాలని ఫెయిర్ ప్రైస్ షాప్ డీ లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్ల గొండ జిల్లా నాయకులు డిమాం డ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చే యడంతో పాటు గౌరవ వేతనం, కమీషన్ పెంపు, ఉచిత రవాణా, బియ్యం తూకంలో పారదర్శకత వంటి సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ డీలర్లు నల్లగొం డ పట్టణంలో ఆందోళన చేపట్టా రు.గడియారం సెంటర్ నుంచి క లెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిం చిన డీలర్లు తమ డిమాండ్లను ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అ నంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏ ఓ మోతీలాల్‌కు వినతిపత్రం అం దజేశారు.

హామీ మేరకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్ర కటించిన విధంగా ప్రతి రేషన్ డీ లర్‌కు నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం చెల్లించాలని, క్వింటాలు బియ్యంపై రూ. 300 కమీషన్ ఇ వ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల నిర్వ హణ ఖర్చులు పెరుగుతున్న నేప థ్యంలో డీలర్లకు తగిన ఆర్థిక భ రోసా కల్పించాలని కోరారు.

రేషన్ షాపులకే ఉచితంగా సరు కుల రవాణా

ఫుడ్ సెక్యూరిటీ చట్టం ప్రకారం రే షన్ సరుకులను దుకాణాల వద్ద కే ఉచితంగా రవాణా చేసి అం దించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అమలవుతున్న విధా నాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని కోరారు. గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు సర ఫరా చేసే బియ్యాన్ని ఖచ్చితమై న తూకంతో అందించి, డీలర్లపై అదనపు భారాన్ని మోపకుండా చూడాలని స్పష్టం చేశారు.

డీలర్లకు అనేక ఇబ్బందులు

గత 20 నెలలుగా దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాల్లోనే ఉం డిపోవడంతో డీలర్లు అనేక ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. నిల్వలు, తరుగుతో ఆర్థిక నష్టాలు పెరుగు తున్నాయని పేర్కొంటూ క్వింటా లుకు 10 శాతం తరుగు సడలిం పు కల్పించాలని డిమాండ్ చేశా రు.బియ్యం నిల్వలు, తూకంలో తేడాలు, తరుగు తదితర అంశా ల కారణంగా డీలర్లపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గిం చేందుకు ప్రభుత్వం తక్షణ చర్య లు తీసుకోవాలని కోరారు. రేషన్ వ్యవస్థ సజావుగా కొనసాగాలం టే డీలర్ల న్యాయమైన సమస్యల కు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

డీలర్ల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి

రేషన్ పంపిణీ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న డీలర్ల సమస్య లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఎన్నికల హామీల అ మలుతో పాటు పెండింగ్ సమ స్యల పరిష్కారానికి చర్యలు తీ సుకోవాలని అసోసియేషన్ నా యకులు కోరారు.ఈ కార్య క్ర మంలో ఫెయిర్ ప్రైస్ షాప్ డీల ర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పొరెపల్లి నాగరాజు, జిల్లా కోశాధికారి కోటగిరి సూర్య నారాయణ, మిర్యాలగూడ డివి జన్ అధ్యక్షుడు పగిళ్ల వెంకటేశ్వ ర్లు, దేవరకొండ డివిజన్ అధ్యక్షు డు కొర్ల శంకర్ నాయక్, నల్లగొం డ డివిజన్ అధ్యక్షుడు మీ సత్తి రెడ్డి, బొల్లా వేణుగోపాలరావు, స ముద్రాల యాదయ్య తదితరు లు పాల్గొన్నారు.



భాగ్యనగరంలో భారీ శబ్దాల కలకలం, భయంతో ఇళ్ల నుంచి పరుగులు

రాజేంద్రనగర్, అత్తాపూర్ సహా పలు ప్రాంతాల్లో శబ్దాలు

ప్రజా దీవెన, హైదరాబాద్: హైద రాబాద్ నగరంలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా వినిపించి న భారీ శబ్దాలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. ఉదయం 9.15 గంటల సమ యంలో రాజేంద్రనగర్, ఉప్పరప ల్లి, అత్తాపూర్, ఎర్రబోడ, లంగర్ హౌస్, కేశవ స్వామినగర్ తదిత ర ప్రాంతాల్లో వరుసగా పేలుళ్లను తలపించే శబ్దాలు వినిపించడం తో ప్రజలు ఉలిక్కిపడ్డారు.భారీ శబ్దాల ధాటికి కొన్ని ఇళ్లలో ని వ స్తువులు కదిలినట్లు స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాజేంద్రన గర్ పరిధిలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించినట్లు అనిపించ డంతో భూకంపం వచ్చిందేమోన ని ప్రజలు ఆందోళనకు గురయ్యా రు. భయంతో పిల్లలను వెంటబె ట్టుకుని ఇళ్ల నుంచి బయటకు ప రుగులు తీశారు. అసలు ఏం జ రిగిందో తెలియక స్థానికులు పర స్పరం ఆరా తీశారు.

కారణాలపై పోలీసుల ఆరా.. దర్యాప్తు ముమ్మరం

సమాచారం అందుకున్న రాజేంద్ర నగర్, లంగర్ హౌస్ పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని పరి స్థితులను సమీక్షించారు. భారీ శ బ్దాలు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటి వెనుక కారణాలేమిటి?అనే అంశాలపై విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరా లను సేకరించేందుకు బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రంగం లోకి దించుతున్నారు.పేలుళ్లను తలపించే శబ్దాల వెనుక అసలు కారణమేంటన్నది ప్రస్తుతం ఆసక్తి కరంగా మారింది. అయితే, శబ్ద లకు గల కారణంపై అధికారిక ని ర్ధారణ వెలువడాల్సి ఉంది. ద ర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘ టనకు సంబంధించి స్పష్టత వ చ్చే అవకాశం ఉంది.

ఘనంగా ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి జన్మదిన వేడుకలు



శాలిగౌరారం : శాలిగౌరారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో ఎన్ యస్ యూ ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు లోడంగి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా అధ్యక్షులు అంజన్ యాదవ్ హాజరయ్యారు.

అనంతరం టీపీసీసీ మీడియా నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వేముల భరత్ రాజ్, నాయకులు మిర్యాల సాయి, చిల్లంశెట్టి సాయి గణేష్, బట్ట అనిల్, కుంభం సందీప్, రాజేష్, నితిన్, శివ తదితర కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.

పీఎం శ్రీ జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్ వల్లాల మోడల్ స్కూల్



శాలిగౌరారం : నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన పీఎం శ్రీ జిల్లా స్థాయి బాలికల కబడ్డీ క్రీడోత్సవాల్లో శాలిగౌరారం మండలం తెలంగాణ మోడల్ స్కూల్ వల్లాల బాలికల జట్టు ప్రథమ బహుమతి సాధించి జిల్లా ఛాంపియన్ గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ... "విద్యతో పాటు క్రీడల్లో కూడా మా విద్యార్థులు రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం గర్వకారణం" అని అన్నారు. విజేతలకు శిక్షణ ఇచ్చిన పీడీ బొడ్డు మల్లేష్ ను, విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి తీవ్ర అన్యాయం

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి న్యాయం చేయాలి - సర్పంచ్ మల్లెపాక సాయిబాబు



ప్రజా దీవెన తుంగతుర్తి: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో నియోజకవర్గ కేంద్రమైన తుంగతుర్తిని పూర్తిగా విస్మరించారని ఆయన పేర్కొన్నారు. రెండో విడతలోనైనా నియోజకవర్గ కేంద్రానికి న్యాయం చేయాలని కోరారు. గుడిసె లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, మరి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న గుడిసెలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై గౌరవ జిల్లా కలెక్టర్ స్పందించి, నియోజకవర్గ కేంద్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

దుబాయ్‌లో గౌడ బంధువుల దసరా సంబరాలు

యూఏఈ నలుమూలల నుంచి 300 మందికి పైగా హాజరు

విదేశీ గడ్డపై వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు



ప్రజా దీవెన, కోదాడ: విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దుబాయ్‌లో కౌండిన్య సేన ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ వేడుకలకు యూఏఈలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మందికి పైగా గౌడ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.ఉపాధి, వ్యాపారాల కోసం స్వదేశాన్ని వీడి యూఏఈలో స్థిరపడిన గౌడ కుటుంబాల సభ్యులంతా ఒకేచోట చేరి దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా గడిపారు. బంధుమిత్రులను కలుసుకుంటూ స్వగ్రామాల్లో జరుపుకునే పండుగలను గుర్తుచేసుకున్నారు. విదేశాల్లో ఉంటున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. విదేశాల్లో పెరుగుతున్న పిల్లలకు తెలుగు భాష, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ వేడుకలు చాటిచెప్పాయి. పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు కలిసి పాల్గొనడంతో దసరా వేడుకలు కుటుంబ సమ్మేళనాన్ని తలపించాయి. స్వదేశానికి దూరంగా ఉంటున్నప్పటికీ తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ, సమాజంలోని ఐక్యతను చాటిచెప్పేలా ఈ కార్యక్రమం సాగింది.ఈ కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాస్ గౌడ్, సమ్మెట సంతోష్, పెద్ద సత్యం, గదర్ల రమేష్, పల్లె బాలరాజ్, శేఖర్ గుండవేణి, గవస్కర్, శ్రీధర్ ఏనుగంటి, శేఖర్ గౌడ్ ఆరే, శరత్ ఆరే, ధర్మేందర్ అబ్బగౌని, అశోక్ యార్లగడ్డ, సహితి యార్లగడ్డ, సత్య రాయుడు, పద్మజ రాయుడు, కుమారస్వామి శ్రీపతి, వినీత శ్రీపతి గౌడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోతుల కోసం వల వేస్తే... 12 అడుగుల కొండచిలువ!

భయంతో కొండచిలువను చంపేసిన రైతు



శాలిగౌరారం : పత్తి చేనును కోతుల బారి నుండి కాపాడుకునేందుకు రైతు వేసిన వలలో కోతులకు బదులు భారీ కొండచిలువ చిక్కుకున్న వింత ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామ శివారులో చోటుచేసుకుంది.నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన రైతు అమరావతి సైదులు తన పత్తి చేనులో పంటకు కోతులు తీవ్ర నష్టం కలిగి స్తుండటంతో, కోతులను అడ్డుకునేందుకు చేను చుట్టూ వలను ఏర్పాటు చేశాడు. మంగళవారం సాయంత్రం పత్తి చేను లోకి వెళ్లిన రైతుకు వలలో సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ చిక్కుకుని ఉండటం కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన రైతు చుట్టుపక్కల రైతులను పిలిచాడు. వారు వచ్చి ఆ కొండచిలువను కొట్టి చంపేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని కొండచిలువను తిలకించారు.

లంచం కేసులో గ్రామపంచాయతీ కార్యదర్శికి రెండేళ్ల జైలు శిక్ష

రూ.4 వేల లంచం తీసుకున్న కేసులో కోర్టు తీర్పు

రూ.10 వేల జరిమానా కూడా విధింపు

ప్రజా దీవెన, వరంగల్: ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాం డ్ చేసే అధికారులపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ రంగల్ జిల్లాలో వెలువడిన ఓ కో ర్టు తీర్పు స్పష్టం చేసింది. శా యంపేట గ్రామ పంచాయతీ కా ర్యదర్శిగా పనిచేసిన కుర్రు కు మార స్వామికి లంచం కేసులో రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పా టు రూ. 10 వేల జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రత్యేక న్యా యస్థానం తీర్పు వెలువరించింది.

వరంగల్ జిల్లా ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి, మూడవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి క్షమ దేశ్‌పాండే ఈ నెల 26న తీర్పు ప్రకటించా రు. క్రైమ్ నంబర్ 10/ఎసీబీ-ఖా న్మా/2008కు సంబంధించిన సీసీ నంబర్ 05/2024 కేసులో నింది తుడిని దోషిగా నిర్ధారించారు. అ వినీతి నిరోధక చట్టం, 1988 లో ని సెక్షన్లు 7, 13(2), సెక్షన్ 13(1)(ఎ)తో కలిపి వర్తించే నిబంధనల కింద శిక్ష విధించారు.

రూ.25,500 అద్దె బిల్లు కోసం రూ.4,000 లంచం

2008 సెప్టెంబర్ 6న శాయంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయం లో కుర్రు కుమార స్వామి ఫిర్యా దుదారుడి నుంచి రూ. 4,000 లంచం డిమాండ్ చేసి స్వీకరించి నట్లు కేసులో తేలింది. పశువైద్య శాల నిర్వహిస్తున్న భవనానికి సంబంధించిన సుమారు రూ. 25,500 అద్దె బిల్లును సిద్ధం చే సి, ఆ మొత్తానికి చెక్కు అందిం చేందుకు లంచం తీసుకున్నట్లు అభియోగాలు నమోదయ్యాయి. విచారణ అనంతరం కోర్టు నింది తుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేసింది.

లంచం అడిగితే 1064కు ఫిర్యా దు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ను సంప్రదించి ఫిర్యాదు చేయా లని అధికారులు సూచించారు.

ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064

వాట్సాప్ 9440446106, ఫేస్ బుక్ Telangana ACB,ఎక్స్ (ట్విట్టర్) ఏవశ్రీఖఅస్ట్రుఱూజదీ తో పాటు ప్రభుత్వ కార్యాల యా లు, ప్రధాన బహిరంగ ప్రదేశాల్లో ఏసీబీకి సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను కూడా ఏర్పాటు చేసిన ట్లు అధికారులు తెలిపారు. ఫి ర్యాదుదారుల పేర్లు, వ్యక్తిగత వి వరాలను గోప్యంగా ఉంచుతా మని స్పష్టం చేశారు. లంచరహి త పాలనకు ప్రజల సహకారం కీలకం. లంచం అడిగే వారిపై చ ట్టపరమైన చర్యలు తీసుకునేం దుకు ధైర్యంగా ఫిర్యాదు చేయా లని ఏసీబీ సూచిస్తోంది.

నేడు వంగమర్తిలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



శాలిగౌరారం అక్టోబర్ 27. శాలిగౌరారం మండలంలోని వంగమర్తి గ్రామ సమీపంలో గల టీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన లిసీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించనున్నట్లు శాలిగౌరారం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పాదూరు శంకర్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి చీనా నాయక్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

వేగవంతంగా ప్రాజెక్టుల భూసే కరణ ప్రక్రియ

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్





ప్రజా దీవెన, నల్లగొండ: వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సం బంధించి భూసేకరణ ప్రక్రియ ను వేగవంతం చేసి, పెండింగ్ పను లను త్వరితగతిన పూర్తి చేయా లని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారు లను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ కా ర్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారు లు, భూసేకర ణ అధికారులతో భూసేకరణ ప్రక్రియ, ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు మంజూరైన భూసేకరణ నిధులను అర్హులైన లబ్ధిదారులకు చెల్లించిన అనంతరం సంబంధిత భూముల రికార్డుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, భూసేకరణకు సంబంధించి అవార్డులను త్వరగా జారీ చేసి, ప్రాజెక్టుల పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవా లనిప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన లబ్ధిదారులకు సం బంధించి అవసరమైన లేఅవు ట్ల ను సిద్ధం చేసి, వాటి ప్రక్రి యను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సేకరించిన భూ ముల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణ పనులను వేగవంతం చేయ డంతోపాటు, ఆయా కాలనీల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. భూసేకరణకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పెండింగ్ సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్క రించాలని తె లి పారు. ప్రభుత్వ నిధులు స ద్వినియోగం అయ్యేలా సేక రించిన ప్రతి గుంట భూమి ప్రజో పయోగానికి వచ్చేలా అధికారు లు సమన్వయంతో పనిచేయా లని జిల్లా కలెక్టర్ ఆదేశించా రు. ఈ సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీ నివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, హాజర య్యారు.

నవంబర్ 5న కరీంనగర్‌లో మహా ర్యాలీ

మహా ర్యాలీ జన సమీకరణ, ఏర్పాట్లపై చర్చించిన బండి సంజయ్....



ప్రజా దీవెన, హైదరాబాద్ అక్టోబర్ 27 : నవంబర్ 5న కరీంనగర్ లో మహా ర్యాలీ దేశమంతా చర్చ జరిగేలా వేలాది మందితో వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహిస్తాం...కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతోపాటు అన్ని వర్గాలను ర్యాలీలో భాగస్వామ్యం చేస్తాం..సర్ పేరిట కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడదాం..కరపత్రాల రూపంలో ప్రజలకు వాస్తవా లు చెబుదాం.మీడియా, సోషల్ మీడియా ద్వారా జనాన్ని చైతన్యం చేద్దాం.కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో కేంద్ర మంత్రి భేటీ మహా ర్యాలీ జన సమీకరణ, ఏర్పాట్లపై చర్చించిన బండి సంజయ్ సర్' పేరుతో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కూల్చి విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్, సీజేపీ, ఆప్ సహా చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 5న కరీంనగర్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ....

"ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం.....

అరాచకత్వాన్ని అంతం చేద్దాం" పేరిట భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో వేలాది మందితో 'మహా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుఎన్. రామచంద్ర రావుతో పాటు జాతీయ ప్రతినిధులు కూడా ఈ ర్యాలీకి హాజరవుతారని తెలిపారు. దేశమంతా చర్చ జరిగేలా వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈరోజు కరీంనగర్ లోని శుభమంగళ కన్వెన్షన్‌లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, మండల ఇంఛార్జీలు సహా ముఖ్య నేతలు హాజరైన ఈ సమావేశానికి కేంద్ర మంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్టీ సీనియర్ నేతలు కోమల ఆంజనేయులు, నల్లాల ఓదెలు, చెన్నమనేని వికాస్ రావు, మోహన్ రెడ్డి, గంగాడి క్రిష్ణారెడ్డి, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ ఏర్పా ట్లు, జన సమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ.....దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ కాంగ్రెస్, విపక్ష కూటమి నేతలు విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయి. ఈ 13 కోట్లలో సుమారు 2.8 కోట్ల మంది మరణించారు. దాదాపు 3 కోట్ల మంది క్షేత్రస్థాయి పరిశీలనలో అడ్రస్‌లలో అందుబాటులో లేరు. 6.3 కోట్ల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. మరో కోటి మంది ఓటర్ల పేర్లు రెండు, మూడు చోట్ల ఓటర్ లిస్టులో నమోదు చేసుకున్నారు. చనిపోయిన ఓటర్లను ఓటర్ జాబితా నుండి తొలగించాలా.....? వద్దా.....? అంతెందుకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చనిపోయి ఏళ్లు దాటినా ఇంకా ఓటర్ జాబితాలో ఆయన పేరుంది. సర్ ప్రక్రియలో భాగంగా ఆయన పేరును తొలగించారు....? ఇందులో తప్పేముంది..... ? అట్లాగే డూప్లికేట్ ఓట్లను తొలగిస్తే రాద్దాంత మెందుకు.....? అట్లాగే విదేశాల నుండి అక్రమంగా వలస వచ్చి ఓటర్లుగా నమోదైన రోహింగ్యాల ఓట్లను తొలగిస్తే తప్పేముంది....? వాస్తవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు హైదరాబాద్ లో రోహిం గ్యాల ఓట్లతోనే గెలుస్తూ వస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 40 వేలకు పైగా రోహింగ్యాలు ఓటర్లుగా నమోదై బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాయి. పాతబస్తీలో మజ్లిస్ పార్టీ సైతం రోహిం గ్యాలు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి ఓట్లతోనే గెలుస్తూ వస్తోంది. నాటి కేసీఆర్ ప్రభుత్వంతో పాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రోహింగ్యాలకు రేషన్ కార్డు, ఇండ్లు సహా ప్రభుత్వ పథకాల లబ్ధి కల్పించాయి. అర్హులైన ఇతర ఓటర్లకు అన్యాయం చేశాయి. సర్ ప్రక్రియలో భాగంగా రోహింగ్యాల ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే ఆయా పార్టీలు తట్టుకోలేక మోదీ ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నా యి. ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయి. ఎన్నికల్లో మోదీని ఎదుర్కొనే శక్తి లేక కాంగ్రెస్ కూటమి ఈ కుట్రలకు సిద్ధమైంది. విపక్షాల కుట్రలను తిప్పికొట్టేం దుకు ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ఈనెల 5న కరీంనగర్ లో లోక్ తంత్ర బచావో–అరాచకత బహావో'....పేరిట వేలాది మందితో కనీవినీ ఎరగని రీతిలో వినూత్న రీతిలో దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా మహా ర్యాలీ నిర్వహిద్దాం. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతో పాటు విద్యార్థులు, యువత, లాయర్లు, ఇంజనీర్లు, మేధావులు, డాక్టర్లుసహా అన్ని వర్గాల ప్రజలను ఈ ర్యాలీలో భాగస్వాములను చేద్దాం. కరపత్రాలు రూపొందించి ఇంటింటికీ పంపి ప్రజలను చైతన్యం చేద్దాం. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలోని పోలింగ్ బూత్ లవారీగా సమావేశాలు నిర్వహించి మహా ర్యాలీకి హాజరయ్యేలా ఏర్పాట్లు చేయండి. వారికి అవసరమైన రవాణా, వసతి సౌకర్యా లను కల్పించండి. వినూత్న రీతిలో కనీవినీ ఎరగని విధంగా మహా ర్యాలీ నిర్వహించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేద్దాం అని ఆయన అన్నారు.

కనగల్ పోలీస్ స్టేషన్ లో ఎస్పీ శరత్ చంద్ర వార్షిక తనిఖీ



ప్రజా దీవెన, కనగల్: నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం కనగల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న జిల్లా ఎస్పీ గారికి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, సిబ్బంది విధుల నిర్వహణ, రికార్డు గదులు, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది కిట్ తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులు, కోర్టు కేసుల వివరాలను సమీక్షించి, కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, అవసరమైన సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని, నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే క్రైమ్ రిజిస్టర్, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, కేసు డైరీ ఫైల్స్, కోర్టు కేసుల రికార్డులు, స్టేషన్ రికార్డులు, బీట్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను గౌరవంగా విని, చట్టపరిధిలో తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తక్షణ పోలీస్ సేవలు అందించాలని తెలిపారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి నేరాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై జరిగే నేరాల విషయంలో తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు, సెలవులు, వసతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకుని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, పారదర్శకత పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ఫిర్యాదుల సత్వర పరిష్కారం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు సూచించారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ గారి వెంట నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బి సీఐ నాగరాజు,చండూర్ సీఐ రాము, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ రాజీవ్ రెడ్డి, సంబంధిత పోలీస్ అధికారులు, కనగల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా పోలీస్ సిబ్బందిలో నా యకత్వ లక్షణాలు పెంపొందాలి

నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్





ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్: నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, స్వీయ అవగాహన, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఖవీజుజుణ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఒ+క్కూ ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖకు ప్రజలే ప్రధానమని, సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి బాధితుడికి భరోసా కల్పించడం పోలీసుల బాధ్యత అని పేర్కొన్నారు.ముఖ్యంగా మహిళలు, బాలికలు, కుటుంబ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను ఓపికగా వినాలని, వారితో గౌరవప్రదంగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా తెలియజేసేలా పోలీస్ స్టేషన్లలో నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. మహిళా పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసంతో వ్యవహరించడంతో పాటు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, క్లిష్ట పరిస్థితుల్లో సంయమనంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పోలీస్ విధుల్లో ఎంతో కీలకమని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో ఆచరణలో పెట్టి, బాధితులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. మహిళా పోలీస్ సిబ్బంది కేవలం చట్టాన్ని అమలు చేసే సిబ్బందిగానే కాకుండా, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే నాయకులుగా, బాధితుల్లో ధైర్యాన్ని నింపే వ్యక్తులుగా ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో సున్నితత్వంతో స్పందిస్తూ, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను మహిళా పోలీస్ సిబ్బంది తమ విధి నిర్వహణకే పరిమితం చేయకుండా, తమ తమ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఇతర సిబ్బందికి కూడా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ సూచించారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలు బాధితులతో సానుభూతితో వ్యవహరించే విధానాలను సహచర సిబ్బందితో పంచుకోవాలని, తద్వారా పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి బాధితుడికి మెరుగైన సేవలు అందిస్తూ, పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, ఒ+క్కూ డిఎస్పీ శ్రీనివాస రావు,ఖఎవవన ఎన్.జి.ఓ సభ్యులు రహమ్మత్ ఉన్నిసా, నందిని, కౌశికి శర్మ, హనిత, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, ఏ.ఎచ్.టి.యు ఎస్.ఐ అంజలి, తదితరులు పాల్గొన్నారు.

వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ

రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం

యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు

పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్

ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా

భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు




న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

ఇలాంటి బ్యాటింగ్ ఎప్పుడూ చూడలేదన్న అయ్యర్.. వాళ్లను ఆపడం కష్టమన్న శాంట్నర్

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా చారిత్రక విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇరు జట్ల కెప్టెన్లు వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రత్యర్థి సారథి మిచెల్ శాంట్నర్ ఆ ఇద్దరినీ ఆకాశానికెత్తేశారు. ఈ అద్భుత ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. "నిజంగా అద్భుతం. వారిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు చాలా ఇంపుగా అనిపించాయి. నేను, సంజు బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతోంది. వాళ్లిద్దరూ ఇలాంటి పిచ్‌పై అంత సులువుగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయాను. ఇది నమ్మశక్యం కాని విషయం" అని అన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి బ్యాటింగ్ చూడటం ఇదే మొదటిసారని, ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం ఎప్పుడూ చూడలేదని అయ్యర్ కొనియాడాడు. వారి ప్రదర్శన అన్నింటికంటే అత్యుత్తమమని ప్రశంసించాడు. మరోవైపు, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కూడా భారత ఓపెనర్ల బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. "వాళ్లు అలా చెలరేగి ఆడుతుంటే ఆపడం చాలా కష్టం. వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను గతంలో ఐపీఎల్‌లో చూశాం. ఇప్పుడు మా దేశంలో ప్రత్యక్షంగా చూశాం. పవర్‌ప్లేలో ఎలా బ్యాటింగ్ చేయాలో వాళ్లు నిరూపించారు" అని శాంట్నర్ వ్యాఖ్యానించారు. మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (113), వైభవ్ సూర్యవంశీ (45) తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్‌ప్లేలో రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించి భారత భారీ విజయంలో ప్రధాన భూమిక పోషించారు.


సీఎస్‌కేలో భారీ ప్రక్షాళన

కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్, పలువురిపై వేటు!



ఐపీఎల్ 2027 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్రాంచైజీ తమ కోచింగ్ విభాగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను కొత్త హెడ్ కోచ్‌గా నియమించిన యాజమాన్యం, పలువురు కీలక సిబ్బందిని విధుల నుంచి తప్పించింది. జట్టు స్ట్రెంత్, కండిషనింగ్ కోచ్ గ్రెగ్ కింగ్‌ను కూడా తొలగిస్తున్నట్లు సోమవారం సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. జట్టు శారీరక దృఢత్వం (ఫిజికల్ ప్రిపరేషన్) కోసం ఇన్నాళ్లు ఆయన అందించిన సేవలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపింది. అదేవిధంగా, మరికొందరు కీలక సభ్యులు కూడా జట్టు నుంచి వైదొలిగినట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది. వారిలో బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ, బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్, అసిస్టెంట్ బ్యాటింగ్ కోచ్ రాజీవ్ కుమార్ ఉన్నారు. వీటితో పాటు, ఐపీఎల్ ప్రారంభ సీజన్ 2008 నుంచి జట్టుతో కొనసాగుతున్న ఫిజియోథెరపిస్ట్ టామీ సిమ్సెక్ సేవలను కూడా నిలిపివేసింది. నూతన నియామకాలలో భాగంగా, జహీర్ ఖాన్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనుండగా, ఇంగ్లండ్ మాజీ ఆఫ్ స్పిన్నర్ గారెత్ బ్యాటీ అసిస్టెంట్ కోచ్‌గా, భారత మాజీ పేసర్ మోహిత్ శర్మ బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యారు. గత 18 ఏళ్ల పాటు సీఎస్‌కే హెడ్ కోచ్‌గా విశేష సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, ప్రస్తుతం ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. అలాగే, సీఎస్‌కే మాజీ బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్, ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ ఫోస్టర్ కూడా ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టుతో కలిసి పనిచేస్తున్నారు.

మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. తన ఇన్నింగ్స్ గురించి అభిషేక్ శర్మ మాట్లాడుతూ, "మా ప్లాన్ చాలా సింపుల్. నేను, వైభవ్ స్వేచ్ఛగా, ఆస్వాదిస్తూ ఆడాలనుకున్నాం. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడే పిచ్‌ను క్షుణ్ణంగా గమనించాం. బౌన్స్ కాస్త ఎక్కువగా ఉందని అర్థమైంది. అయితే, మైదానం కొలతలు, బౌలర్ల వేగాన్ని ఉపయోగించుకుని పవర్‌ప్లేలో దూకుడుగా ఆడవచ్చని భావించాం. వైభవ్ తొలి ఓవర్‌లోనే దూకుడుగా ఆడటం జట్టుకు మంచి ఊపునిచ్చింది. అదే జోరును కొనసాగించాలనుకున్నాం" అని వివరించాడు. ఈ ప్రదర్శన వెనుక చాలా కఠోర శ్రమ, సరైన ప్రణాళిక ఉందని అభిషేక్ అన్నాడు. "కోచింగ్ సిబ్బంది, కెప్టెన్ నాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు. ముఖ్యంగా మా కోచ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. నెట్స్‌లో సైడ్ ఆర్మ్ ద్వారా మేము చాలా ప్రాక్టీస్ చేశాం. ఒక బ్యాటర్‌గా మ్యాచ్‌కు ముందు చేసే సన్నాహకమే అత్యంత కీలకం. పరిస్థితులు, మైదానం కొలతలను దృష్టిలో ఉంచుకుని, బౌలర్లకు అనుగుణంగా షాట్లు ఆడాల్సి ఉంటుంది. నిన్న ప్రాక్టీస్ సెషన్‌లో చేసిన ప్రణాళికలనే ఇవాళ అమలు చేశాను. ఈ ఇన్నింగ్స్ ఆడాలని బలంగా కోరుకున్నాను, అది నెరవేరింది" అని తన సంతోషాన్ని పంచుకున్నాడు. గతంలో 12 బంతుల్లో 50 పరుగులు చేసిన యువరాజ్ సింగ్, 'ఇప్పటికీ 12 బంతుల్లో హాఫ్ సెంచరీ చేయలేకపోయావ్' అంటూ సరదాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్‌పై అభిషేక్ స్పందించాడు. "ఆ రోజుల్లో యువీ పాజీ ఎలాంటి క్రికెట్ ఆడాడో నాకు తెలియదు కానీ, 12 బంతుల్లో 50 పరుగులు చేయడం అస్సలు సులభం కాదు. ఏ బ్యాటర్ అయినా అలా ఆడాలనుకుంటే అది చాలా కష్టం. అది ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతుంది. అయితే, ఒక బ్యాటర్‌గా మేము ఆ మైలురాళ్ల కోసం ఆడం. జట్టు కోసం మ్యాచ్ గెలవాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగుతాం" అని అభిషేక్ శర్మ స్పష్టం చేశాడు.

భారత మిడిలార్డర్‌లో ఆరోగ్యకరమైన పోటీ: నితీశ్ రెడ్డి



భారత జట్టు మిడిలార్డర్ బ్యాటర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉందని ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. ఒకరు పరుగులు సాధిస్తే మరొకరు స్ఫూర్తి పొందుతారని, అవకాశం వచ్చినప్పుడు తామూ రాణించాలనే పట్టుదల పెరుగుతుందని పేర్కొన్నాడు. జట్టు విజయాల్లో ఇలాంటి పోటీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత మిడిలార్డర్ అద్భుతంగా రాణిస్తోంది. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో, రెండో మ్యాచ్‌లో క్లిష్ట పరిస్థితుల్లో 181 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించింది. మూడో టీ20కి ముందు నితీశ్ మాట్లాడుతూ.. "జట్టులో పోటీ తప్పకుండా ఉంటుంది. అయితే అది ఆరోగ్యకరమైన పోటీగా ఉండాలి. నమన్ లేదా తిలక్ పరుగులు సాధిస్తే.. నా వంతు అవకాశం కోసం నేను ఎదురుచూస్తాను. వారు విఫలమైనప్పుడు నేను పరుగులు చేస్తే.. తర్వాత తమకు అవకాశం రావాలని వారు ఆశిస్తారు. టీమ్ గేమ్ ఎదిగేది ఇలాగే. ఆరోగ్యకరమైన పోటీ అంటే ఇదే" అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే భారత జట్టు విజయాలకు ప్రధాన కారణమని నితీశ్ తెలిపాడు. "ప్రస్తుత పరిస్థితులపై దృష్టి పెట్టడం, మ్యాచ్ పరిస్థితులను సరిగ్గా అంచనా వేయడం ముఖ్యం. భారత్‌లో చాలా క్రికెట్ ఆడినా.. న్యూజిలాండ్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, మన బలాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి" అని వివరించాడు.



వృషకర్మ.. నాగచైతన్య మార్కెట్ ఏ లెవెల్లో పెరిగిందంటే..

నాగచైతన్య కెరీర్‌కు 'తండేల్' ఎంత పెద్ద బూస్ట్ ఇచ్చిందో ఇప్పుడు ఆయన కొత్త సినిమా బిజినెస్ చూస్తే అర్థమవుతోంది. గతంలో చైతూ సినిమాల థియేట్రికల్ రైట్స్ ఒక రేంజ్‌లో ఉంటే ఇప్పుడు అంతకుమించి అనేలా ఉన్నాయి. 'వృషకర్మ' కోసం డిస్ట్రిబ్యూటర్లు భారీ డీల్స్ ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. ముఖ్యంగా దిల్ రాజు ఈ సినిమా కోసం చేస్తున్న డీల్ టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి పెంచుతోంది. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక ప్రీరిలీజ్ బిజినెస్ చేస్తున్న సినిమాగా 'వృషకర్మ' నిలుస్తోంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మూడు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను దిల్ రాజుకు చెందిన ఎస్వీసీ రిలీజ్ రూ. 45 కోట్లకు తీసుకుంది. ఇందులో రూ. 40 కోట్లు నాన్‌రిఫండబుల్ కాగా, మిగిలిన రూ. 5 కోట్లు రిఫండబుల్ ఒప్పందంలో భాగంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. నిజానికి 'తండేల్'కు ముందు నాగచైతన్య మార్కెట్ పరిస్థితి వేరు. చందూ మొండేటి దర్శకత్వంలో వచ్చిన 'తండేల్' వంద కోట్లకు పైగా వసూళ్లతో చైతూ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఆ విజయం తర్వాత ఆయన ఎంచుకున్న 'వృషకర్మ' బడ్జెట్, మేకింగ్, బిజినెస్ అన్నింటిలోనూ మరో మెట్టు పైకి వెళ్లింది. పైగా థియేట్రికల్ బిజినెస్ ఒక్కటే కాదు. 'వృషకర్మ' డిజిటల్, శాటిలైట్ హక్కులను ప్రముఖ సంస్థ భారీ ధరకు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. నాగచైతన్య కెరీర్‌లో నాన్ థియేట్రికల్ పరంగా కూడా ఇదే అతిపెద్ద డీల్‌గా చెబుతున్నారు. ఇప్పుడు మొత్తంగా విడుదలకు ముందే ఇండస్ట్రీలో 100 కోట్లకు పైగా బిజినెస్ చేసే హీరోగా నాగచైతన్య రేంజ్ మారుతోంది. 'విరూపాక్ష'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న కార్తీక్ దండు ఈ సినిమాకు దర్శకుడు కావడం మరో పెద్ద ప్లస్. మైథలాజికల్ అంశాలతో కూడిన అడ్వెంచర్ థ్రిల్లర్‌గా 'వృషకర్మ'ను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. నాగచైతన్య లుక్, ఇప్పటివరకు విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

బంగారమ్ .. గ్లోయింగ్ మామ్.. సమంతపై నెటిజనుల ప్రేమ..!

సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే నటి సమంత తాజాగా షేర్ చేసిన ఫోటోలు నెటిజనులను, అభిమానులను గొప్పగా ఆకట్టుకుంటున్నాయి. పెళ్లయిన తర్వాత వ్యక్తిగత జీవితాన్ని, కెరీర్‌ను ఎంతో చక్కగా సమతుల్యం చేసుకుంటున్న సమంత ముఖంలో ప్రస్తుతం సరికొత్త కళ కనిపిస్తోంది. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఈ శుభసమయంలో తను షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సమంత అందం, ఆనందం చూసి నెటిజన్లు -గ్లోయింగ్ మామ్-, -బంగారం- అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తూ తమ ప్రేమాభిమానాలను చాటుకుంటున్నారు. ఈ కొత్త పోస్ట్ చూడగానే అభిమానులందరికీ ఒక్కసారిగా సమంత నటించిన క్లాసిక్ పాత్రలు గుర్తుకొచ్చాయి. ముఖ్యంగా మొదటి రెండు ఫోటోలు చూడగానే రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఘన విజయం -ఈగ- చిత్రంలోని -బిందు- క్యారెక్టర్ వైబ్స్ మళ్లీ కనిపిస్తున్నాయని కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు పెద్ద ఎత్తున రచ్చ చేస్తున్నారు. ఆ రోజుల్లో వెండితెరపై చూసిన ఆ అమాయకత్వం, స్వచ్ఛమైన అందం ఇప్పటికీ అలాగే ఉన్నాయని చెబుతూ.. సమంత టైమ్‌లెస్ బ్యూటీని, తన సింపుల్ అండ్ క్లాసిక్ లుక్‌ని మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నారు. సినిమాటిక్ జ్ఞాపకాలతో పాటు... సమంత జీవితంలోకి రాబోతున్న ఈ మాతృత్వపు తీపి అధ్యాయంపైనా అభిమానులు తమ ఆప్యాయతను చాటుకుంటున్నారు. కామెంట్ సెక్షన్‌లో -ప్రెట్టీ మమ్మీ-, -గ్లోయింగ్ మామ్- అంటూ ఎంతో ప్రేమగా సంబోధిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సమంతకు బాబు పుడతాడా లేక పాప పుడుతుందా? అని అభిమానులు ఎంతో ఉత్సాహంగా అంచనాలు వేస్తూ.. తన ఆరోగ్యంతో పాటు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్ సెక్షన్‌ను దీవెనలతో నింపేశారు.





ఆ సినిమా ఫ్లాప్ అయినా పోయిందేం లేదు : కీర్తి సురేష్

సినిమా ఇండస్ట్రీలో ఒక హిట్, ఒక ఫ్లాప్ మొత్తం కెరీర్‌ను మార్చడం మనం చూస్తూ ఉంటాం. అప్పటి వరకు చాలా సినిమాలు చేసి హిట్ కొట్టి ఇండస్ట్రీలో మంచి పేరు తెచ్చుకున్న హీరో లేదా హీరోయిన్ లేదా దర్శకుడు ఒక్క ఫ్లాప్‌తో కనిపించకుండా పోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. కొందరు వరుస ఫ్లాప్స్ పడుతున్నా ఒక్క హిట్‌తో ఎక్కడికో వెళ్లడం మనం చూస్తూనే ఉంటాం. అయితే ఇండస్ట్రీలో అడుగు పెట్టిన మొదటి సినిమాతోనే ఫ్లాప్ పడితే ఆ ఇండస్ట్రీలో ఆ హీరోయిన్ నిలదొక్కుకోవడం చాలా కష్టం. కానీ కొందరు హీరోయిన్స్‌కి మొదటి సినిమాతో ఫ్లాప్ పడ్డా లక్కీగా వరుసగా ఆఫర్లు పడ్డాయి. తెలుగులో శ్రీలీల మొదటి సినిమా ఫ్లాప్ అయినా వరుస ఆఫర్లు దక్కించుకుంది. ఇంకా కొందరు కూడా ఉన్నారు. ఇప్పుడు అదే జాబితాలో కీర్తి సురేష్ నిలిచింది. బాలీవుడ్‌లో ఈమె మొదటి సినిమా 'బేబీ జాన్' ఫ్లాప్ అయింది. అయినా కూడా ఆ సినిమా వల్ల బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వస్తున్నాయని కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది.

కీర్తి సురేష్ ఇటీవల ఒక చిట్ చాట్ లో తన బాలీవుడ్ ఎంట్రీ మూవీ బేబీ జాన్ గురించి మాట్లాడుతూ ఏమాత్రం అసంతృప్తి లేదని చెప్పుకొచ్చింది. బాలీవుడ్‌లో అవకాశం రాగానే చాలా సంతోషపడ్డాను, కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయినా కూడా నాకు పోయిందేం లేదు, ఆ సినిమాలో నా నటనను మెచ్చి బాలీవుడ్ నుంచి ఆఫర్లు వచ్చాయి. బేబీ జాన్ ఫ్లాప్ అయినప్పటికీ రాజ్‌కుమార్ రావుతో కలిసి రప్తార్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఇంకా పలు సినిమాల్లో నటించేందుకు ఆఫర్లు వచ్చాయి. కనుక బేబీ జాన్ ఫ్లాప్ అయినంత మాత్రాన నాకు ఏదో నష్టం జరిగిపోలేదని కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. తమిళ్‌లోనూ నాకు ఫ్లాప్ పడ్డ సమయంలో ఆ సినిమాలోని నటన చూసి 'మహానటి' సినిమాలో నాగ్ అశ్విన్ గారు ఛాన్స్ ఇచ్చారని కీర్తి సురేష్ కొత్త లాజిక్‌ను, చాలా పాజిటివ్‌గా చెప్పడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

మృణాల్ దీపావళి మెరుపులు విరుపులు

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనదైన అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్, తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న -దివాళీ ఎడిషన్- ఫొటోషూట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ ఫొటోలలో మృణాల్ నలుపు రంగు శారీ ధరించి రాయల్ అండ్ క్లాసీ లుక్‌తో కనిపించారు. క్లాసిక్ శైలికి ఆధునిక స్పర్శను జోడిస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ రాయల్ అండ్ ఎలిగెంట్ లుక్ వెనుక ఒక పెద్ద స్టైలింగ్ టీమ్ పనిచేసింది. -ఇత్రు- బ్రాండ్‌కు చెందిన నల్లటి డిజైనర్ శారీలో మృణాల్ మెరిసిపోగా.. ఈ లుక్‌ను అంజలి-స్నేహల్ అత్యంత ఆకర్షణీయంగా స్టైల్ చేశారు. దానికి తగినట్లుగా -బెస్పోక్ ఓజెల్స్- హ్యాండ్‌బ్యాగ్, -అపరాజిత తూర్- ఫుట్‌వేర్‌ను మ్యాచ్ చేశారు. మేకప్ ఆర్టిస్ట్ మిస్ బ్లెండర్, హెయిర్ స్టైలిస్ట్ దీపాలి దేవకర్ , శారీ డిజైనర్ శిల్పా ఈ బ్యూటీని దేవకన్యలా తీర్చిదిద్దగా, విధి గోధా తన కెమెరాతో ఈ అందమైన ఫోటోలను బంధించారు. సాధారణంగా పండుగల సమయాల్లో ఎరుపు, పసుపు వంటి సాంప్రదాయ రంగులను ఎంచుకుంటారు.. కానీ మృణాల్ మాత్రం నలుపు రంగు శారీని ఎంచుకుని సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు. మృణాల్ అందమైన ఎక్స్ ప్రెషన్స్ కి తగ్గ డిజైనర్ లుక్ ఇది. అధునాతన శైలికి రాయల్ అలగెన్స్ జోడిస్తే ఎంత బావుంటుందో ఈ ఫోటోషూట్ చెప్పకనే చెబుతోంది. ఈ ఫోటోలకు ఇంటర్నెట్ లో స్పందన అద్భుతం. శోభిత ధూళిపాళ, ప్రగ్యా వంటి తోటి నటీమణులు ఈ లుక్‌పై ప్రశంసలు కురిపించగా.. నెటిజన్లు --బ్లాక్ శారీలో మృణాల్ దేవతలా ఉందంటూ-- కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సీతా రామం, హాయ్ నాన్న సహా పలు చిత్రాల్లో అద్భుత నటనాభినయంతో కట్టి పడేసిన మృణాల్ మరిన్ని తెలుగు చిత్రాల్లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ సినిమాలు, వెబ్ సిరీస్ లతో మెప్పించేందుకు తన వంతు ప్రయత్నాల్లో ఉంది.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA